ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
అనంతపురం, రాప్తాడు, శింగనమల :9985411608
తాడిపత్రి, : 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ, : 9985411657,
కళ్యాణదుర్గం, :9701120019,
రాయదుర్గం, : 9000406723,
ఏసీఎం: 9985411154

పోస్టుల భర్తీలో సెగలు

సమగ్ర శిక్షలో నాలుగే భర్తీ

కలెక్టర్ ఓకే చేసినా మోకాలడ్డిన కమిషనర్



అనంతపురం విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టుల్లో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ సెగలు పుట్టిస్తోంది. ఏడు నెలల కిందట 8 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే నాన్చి, నాన్చి నలుగురిని భర్తీ చేస్తూ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు రావటం దుమారాన్ని రేపుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల వెంట తిరిగిన వారికీ పెద్దపీట వేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ నిర్ణయంపై కొందరు ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. జిల్లా విద్యాశాఖాధికారులపై శుక్రవారం కొందరు ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

జూలై 31న నోటిఫికేషన్

అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ), అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ పోస్టులకు గత ఏడాది జూలై 31న కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ తర్వాత అక్టోబరు 1న ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలెక్టర్ నామినేట్ చేసిన అసిస్టెంట్ కలెక్టర్, డీపీసీ, ఏపీసీ, డైట్ ప్రిన్సిపాల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. గతంలో ఎనిమిది పోస్టులకు గాను ఆరు పోస్టులకు అర్హులైన అభ్యర్థులను కలెక్టర్ ఎంపిక చేసినట్టు సమాచారం. ఆ ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలను డీఈఓ గతంలోనే కమిషనర్‌కు పంపారు. అయినా సుమారు ఏడు నెలలుగా వాయిదా వేస్తూ వచ్చారు. ఎట్టకేలకు నలుగురిని ఎంపిక చేసినట్లు రెండు రోజుల కింద డీఈఓకు లిస్టు పంపారు. ఏఎంఓగా ఆనందభాస్కర్, జీసీడీఓగా కవిత, అసిస్టెంట్ అలెస్కోగా గురుముని, అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్)గా ఫణిశేఖర్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు డీఈఓ స్పష్టం చేశారు. ఇతర పోస్టులకు ఎంపిక చేసిన వారిని తిరస్కరించినట్టు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ప్రభుత్వం మారినా...

గత ప్రభుత్వంలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే పలు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులను భర్తీ చేశారు. గుట్టు చప్పుడు కాకుండా భర్తీ చేసి ఉద్యోగాలు చేయించారు. కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి, ఇంటర్వ్యూలు నిర్వహించినా ఫలితాలు ఇవ్వకుండా ఏడు నెలలు వాయిదా వేశారు. అయితే రెండు రోజుల కిందట ఉన్న ఫలంగా నలుగురిని భర్తీ చేస్తూ ఆదేశాలిచ్చారు. కలెక్టర్ ఎంపిక చేసిన ఆరుగురు అభ్యర్థుల్లో నలుగురికి అవకాశం ఇచ్చి, మరో ఇద్దరిని రిజెక్ట్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. సమగ్రశిక్ష చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ ఎంపిక చేసిన వారి జాబితాకు గతంలో కమిషనర్లు, ఎస్పీడీ ఆమోదం తెలిపేవారు. ఈ దఫా కలెక్టర్ ఎంపిక చేసిన వారిలో నలుగురికి పోస్టులు ఇచ్చి, ఇద్దరికి మొండిచెయ్యి చూపడంపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యం అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ సీఎంఓ పోస్టులకు ఎంపిక చేసిన వారిని రిజెక్ట్ చేసినట్టు తెలుస్తోంది. వైసీపీకి ఎన్నికల్లో అనుకూలంగా వ్యవహరించిన వారికి సైతం అవకాశం ఇవ్వడంపై అనేక విమర్శలు వచ్చాయి. ఈ విషయంలో కొందరు ఎమ్మెల్యేలు జిల్లా విద్యాశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అదేవిధంగా కమిషనర్, ఎస్పీడి దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

సన్న బియ్యం అని చెప్పి..

స్టోర్ బియ్యం అంటగట్టి..


స్టోర్ బియ్యం బస్తాలు.. స్టోర్ బియ్యాన్ని కింద పోసిన గ్రామస్థులు

విడపనకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామస్థులను సన్న బియ్యం మాటున మోసం చేశారు. సన్నబియ్యం అని నమ్మించి, స్టోర్ బియ్యం విక్రయించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితం గ్రామానికి ఓ వ్యక్తి వచ్చాడు. తన పేరు హర్షవర్దన్ రెడ్డి అనీ, ఆమిద్యాల గ్రామమనీ సెల్ నంబరు 7659835583 కూడా ఇచ్చాడు. సన్న బియ్యం విక్రయించేందుకు వచ్చానని చెప్పాడు. సన్న బియ్యం మంచిగా ఉంటాయని గ్రామస్థులను నమ్మించాడు. క్వింటా రూ.4200తో ప్రజలకు అంటగట్టాడు. అలా ఏకంగా 40 క్వింటాళ్ల వరకు బియ్యం విక్రయించాడు. వారం రోజుల తరువాత బియ్యం ప్యాకెట్లను విప్పి చూడగా వాటిలో స్టోర్ బియ్యం కనిపించాయి. మోసపోయామని గ్రామస్థులు వాపోయారు. ఫోన్ చేసి బియ్యం వ్యాపారిని అడగ్గా.. తాను ఎవ్వరికీ బియ్యం విక్రయించలేదని దబాయించి, ఫోన్ కట్ చేశాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.


కూడేరు పరిధిలో పశువులకు వదిలేసిన పంట
కళ్యాణదుర్గం పరిధిలో తోటలోనే మాగిపోయిన టమోటా

టమోటా రైతుకు మద్దతు

వారం రోజులుగా ధరలు పతనం

- సరిహద్దులు దాటినా నిష్ప్రయోజనం
- కక్కలపల్లిలో బాక్స్ రూ.50.. కర్ణాటకలో రూ.80
- స్పందించిన ప్రభుత్వం.. రంగంలోకి మార్కెటింగ్ శాఖ
- కిలో రూ.8 ప్రకారం కొనుగోలు.. రైతు బజార్లకు తరలింపు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

టమోటా ధరలు భారీగా పతనమయ్యాయి. వారం రోజులుగా కనీస ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లా రైతాంగం టమోటాను అమ్ముకునేందుకు సరిహద్దులు దాటి.. తెలంగాణ, కర్ణాటక మార్కెట్‌లకు తరలించినా గిట్టుబాటు కావడం లేదు. మేలు రకం టమోటా సైతం కిలో రూ.3 నుంచి రూ.5 పలకడం లేదు. కూడేరు రైతులు వారం క్రితం కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు దిగుబడులు తీసుకురాగా.. బాక్సు రూ.50 మాత్రమే పలికింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల రైతులు కొక్కంటి క్రాస్, అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్‌లకు దిగుబడులను తరలించగా.. 25 కిలోల బాక్స్ రూ.80 నుంచి రూ.120 మాత్రమే ధర పలికాయి. కళ్యాణదుర్గం ప్రాంత రైతులు మదనపల్లి, శ్రీనగర్, కర్ణాటకలోని కోలారు, బాగేపల్లి, శ్రీనగర్ టమోటా మార్కెట్‌లకు తరలించగా.. 16 కేజీల బాక్స్ ధర రూ.100 నుంచి రూ.170 మాత్రమే పలికింది. దీంతో ప్రభుత్వం స్పందించింది. మద్దతు ధరతో కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖను ఆదేశించింది. అధికారులు తొలిరోజు శుక్రవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో రూ.8 ప్రకారం రైతుల నుంచి దిగుబడులను కొనుగోలు చేసి.. (మిగతా 7వ పేజీలో)


గార్లదిన్నె మండలంలో మార్కెట్‌కు తరలించేందుకు గ్రేడింగ్ చేస్తున్న రైతులు

అపురూపం..!

సృష్టిలో అద్భుతం...
కవలల బంధం
కష్టసుఖాల్లో ఒక్కటిగా..
ఒకరికొకరుగా..
నేడు కవలల దినోత్సవం



6

ఫెప్టీ.. ఫెప్టీ ..!

ఓకే అంటే సబ్సిడీ లోన్ ఇప్పిస్తా..
నిరుద్యోగులకు మీ సేవ నిర్వాహకుడి ఆఫర్
నమ్మించి డబ్బు గుంజుతున్న మాయగాడు

బస్సు బోల్తా.. 20మందికి గాయాలు


గుత్తి ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

ముగ్గురు వైద్యుల తొలగింపు

7

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గార్లదిన్నె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంటిమడుగు కొత్తురుకు చెందిన రైతు శ్రీనివాస్ రెడ్డి(57) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న ఏడు ఎకరాలలో చీనీ, వరి సాగు చేశాడు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. రూ.10 లక్షలకు పైగా అప్పులు పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో గురువారం రాత్రి తోటకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం వెళ్లి చూసేసరికి మృతిచెందాడు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ రెడ్డికి భార్య లక్ష్మీదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు.



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

యాపారం
మొదలైంది..!
ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభం (6లో...)

గుట్టపై వైసీపీ గద్దలు

గనుల అధికారుల సహకారం

వారి పేర్లు చెప్పి తవ్వకాలు
యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా
కరిగిపోతున్న గుట్ట


నరసనాయనికుంట సమీపంలోని ఆంజనేయస్వామి గుట్ట

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా వైసీపీ శ్రేణుల జోరు ఎందులోనూ తగ్గడం లేదు. అధికారంతో నిమిత్తం లేకుండా పేట్రేగిపోతున్నారు. అన్నింటా వారి హవానే సాగుతోంది. అధికారులు సైతం సహకారం అందిస్తుండటంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మండలంలోని నరసనాయనికుంట గ్రామ సమీపంలోని గుట్టలో ఎ.నారాయణపురానికి చెందిన ఓ వైసీపీ ఎంపీటీసీ కుటుంబ సభ్యుడు, నగరానికి చెందిన మరో నాయకుడు కలిసి మట్టిని కొల్లగొడుతున్నారు. యంత్రాలతో గుట్టను తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారుల పేరిట మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గుట్ట మంచుకొండలా కరిగిపోతోంది.


గుట్టను తవ్విన దృశ్యం

గుట్టకు గుండు..

నరసనాయనికుంట గ్రామ సమీపంలో ఆంజనేస్వామి గుట్ట ఉంది. ఆ గుట్టపై వైసీపీ నాయకులు గద్దల్లా వాలిపోయారు. కొన్ని రోజులుగా ఎక్స్‌కవేటర్‌తో గుట్టను తవ్వి, మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.6వేలతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే సిండికేట్‌నగర్, నాగిరెడ్డిపల్లి, నగర సమీప ప్రాంతాల్లో లేఅవుట్లు, ఇతరత్రా అవసరాలకు తరలిస్తున్నారు. వందల టిప్పర్ల మట్టిని తోలారు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలతో గుట్ట కరిగిపోతోంది.


గుట్టపై ఉన్న ఎక్స్‌కవేటర్

మైన్స్ అధికారుల పేరిట రవాణా

కొండ, గుట్టల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి. ఆ మేరకు టిప్పర్‌కు రూ.2వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇంత మొత్తంలో సంబంధిత శాఖకు చెల్లిస్తే తమకేం మిగులుతుందనుకున్నట్లున్నారు వైసీపీ నాయకులు. సంబంధిత అధికారులతో మాట్లాడుకుని మట్టి రవాణా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాయల్టీ సిబ్బంది ఉన్నా.. ప్రశ్నించలేని పరిస్థితి. ప్రశ్నించినా సంబంధిత అధికారుల పేర్లు చెబుతుండటంతో చేసేదిలేక టిప్పర్లను వదిలేస్తున్నట్లు ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది. గ్రామస్థులు ప్రశ్నిస్తున్నా.. అనుమతులున్నాయని చెబుతుండడంతో మిన్నకుండిపోతున్నారు.

విచారించి, చర్యలు తీసుకుంటాం

అనుమతులుంటేనే మట్టి తవ్వకాలు చేపట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. నరసనాయనికుంట గుట్టలో తవ్వకాలపై విచారించి, చర్యలు తీసుకుంటాం.

- ఆదినారాయణ, అసిస్టెంట్ జియాలజిస్ట్, గనుల శాఖ

లంచ్ అవతారం!



బడికి వెళ్లినప్పుడు బెదిరించి బెంబేలెత్తించే బంగార్రాజు.. మాంచి భోజన ప్రియుడని పాఠశాలల యాజమాన్యాలు గుర్తించాయట.! ఆయన విజిట్ ఉంటుందని తెలియగానే కరస్పాండెంట్లు, టీచర్లు తెగ హడావుడి చేస్తుంటారట. 'సార్ వస్తున్నారు..! ఈ లోగా ఘుమఘుమలాడే లంచ్‌ను సిద్ధం చేయండి' అని వంట వారిని పురమాయిస్తారట. స్వర్ణాభరణాలను కానుకలుగా స్వీకరించే విద్యాశాఖలోని ఆ అధికారి.. లంచావతారే కాదు.. 'లంచ్ అవతారి' కూడా అని అంటున్నారు. డివిజనల్ స్థాయిలో పనిచేసే ఆయన.. పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు హల్‌చల్ చేయడం, ఆ తరువాత కనకపు కానుకలు స్వీకరించడం పరిపాటి అంటున్నారు. అందుకే ఆయనను ప్రసన్నం చేసుకునేందుకు పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు 'విందు భోజనం' పెడుతుంటాయని ప్రచారం ఉంది. బడిలో మాంచి లంచ్ సిద్ధం కాగానే, 'ఇంట్లో అమ్మగారు ఉంటారు. కారులో వెళ్లి పిలుచుకు రండి' అని పురమాయిస్తారట. ఒంటరిగా సారుకు ముద్ద దిగదేమో.. అని కరస్పాండెంట్లు గొణుగుతూనే కారు పంపిస్తుంటారట.

ఏమైంది బంగారం..?

'గుమ్మడికాయల దొంగ. అంటే భుజాలు తడుముకున్నట్లు' బంగారు బుల్లోడు వ్యవహరిస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమైనప్పటి నుంచి ఆయన ఒంటి మీద బంగారం కనిపించడం లేదట. అలంకార ప్రియుడైన బంగార్రాజు.. ఆభరణాలను నీట్‌గా సర్దేసి ఇంట్లో పెట్టారట. ఆంధ్రజ్యోతి కథనాలపై ఇప్పటికే విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో ఎందుకొచ్చిన గొడవ అనుకున్నారో ఏమో.. అన్నీ సర్దేశారని సమాచారం. మెడలో చైను, వేలికి ఉంగరం, మణికట్టుకు బ్రాస్‌లైట్ వంటివి కనిపిస్తే.. వాటివైపు అందరూ అనుమానంగా చూస్తారని, ఎవరు ఏ ప్రశ్నలు వేస్తారోనని ఆయన ఆందోళన చెందినట్లు కనిపిస్తోంది. ఎప్పుడూ ధగధగ మెరిసిపోయే సారు.. ఇప్పుడు బోసిపోయిన మెడతో కార్యాలయానికి వస్తున్నారని విద్యాశాఖ సిబ్బంది సానుభూతి వ్యక్తం చేస్తున్నారట.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య

డ్రగ్స్‌పై అవగాహన

కలెక్టరు వినోద్‌కుమార్ సూచన


మాదకద్రవ్యాలపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలను వినియోగించకుండా పెద్దఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిశాఖ ఉన్నతాధికారులు ఎస్పీ నిర్వహిస్తున్న సోషల్‌మీడియా గ్రూపులో భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అందిస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో పూర్తి వసతులతో డీ-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, అవసరమైన సిబ్బంది ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

గట్టి నిఘా ఉంచాం: జగదీష్, ఎస్పీ

జిల్లాలోకి డ్రగ్స్, మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. గత జనవరి17 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 5.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మొత్తం 11మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. ఈ గంజాయిని మహారాష్ట్రలోని షోలాపూర్ రైల్వేస్టేషన్, ఒడిశాలోని భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌ల నుంచి అనంతపురం, గుంతకల్లుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి గురించి క్రయ, విక్రయాలు, రవాణా వంటి విషయాలను టోల్‌ఫ్రీనెంబర్ 1972కు తెలపాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీటీసీ వీర్రాజు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలను కట్టడి చేయాలి: జీఆర్పీ ఐజీపీ 6





తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న భాషా ప్రేమికులు

మాతృభాషను రక్షించుకోవాలి

తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు నారాయణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మాతృభాష మాతృమూర్తితో సమానమన్నారు. జీవనోపాధి కోసం ఆంగ్లాన్ని నేర్చుకోవడం తప్పుకాదని, అదే సర్వస్వం అనుకోవడమే తప్పు అవుతుందన్నారు. తేనెవంటి తెలుగును రక్షించుకోవాలంటే రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలోనూ కనీసం ఐదో తరగతి వరకైనా తెలుగు మాధ్యమంలోనే బోధన జరగాలన్నారు. శిశువు మానసిక వికాసానికి మాతృభాషను మించింది ఏదీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్ హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగరాజు, ముత్యాలప్ప, వెంకటనారాయణ, నానీల నాగేంద్ర, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, పీవీకేకే ఉపాధ్యాయుడు ఈరన్న, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

యాపారం మొదలైంది..!

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభం

- విద్యా సంవత్సరం ముగియకనే సందడి
- టీచర్లు, సిబ్బందికి 'యాజమాన్యాల' టార్గెట్
- పిల్లలను చేర్చకపోతే జీతంలో కోతలు
- ఇతర స్కూళ్లకు తరలివెళ్లకుండా విద్యార్థులకు ఫీజుల వల
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు

నియోజకవర్గం	కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు	పనిచేస్తున్న సిబ్బంది
అనంతపురం అర్బన్	176	1428
గుంతకల్లు	132	913
కళ్యాణదుర్గం	36	334
రాప్తాడు	50	510
రాయదుర్గం	60	404
శింగనమల	60	456
తాడిపత్రి	117	950
ఉరవకొండ	47	328
మొత్తం	678	5,323

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'ఫీజు కట్టండి. బుక్స్ కొనుక్కోండి'. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్ స్కూళ్ల వద్ద ఈ మాటలు సర్వసాధారణం. కానీ నాలుగు నెలల ముందే వినిపిస్తున్న ఈ మాటలు తల్లిదండ్రులకు కర్ణకఠోరమనిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. కానీ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అప్పుడే బుక్కుల వ్యాపారం మొదలెట్టేశారు. 2025-26 విద్యాఏడాదికి ఇప్పటి నుంచే ముందస్తు అడ్మిషన్ల పేరుతో వ్యాపారం మొదలెట్టారు. దీనికి కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు బలి అవుతున్నారు. క్లాసులు చెప్పడం అటుంచితే, అడ్మిషన్ల టార్గెట్‌తో వేధిస్తున్నారు.

జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు



శ్రీచైతన్య, నారాయణ వంటి కొన్ని కార్పొరేట్ స్కూళ్లు ముందస్తు అడ్మిషన్ల కోసం టీచర్లను వేధిస్తున్నారు. కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు చేయకపోతే జీతం హోల్డ్‌లో పెడతామంటూ బెదిరిస్తున్నారు. హాలిడేస్‌లో ఫోన్లలోనూ, బయట తిరిగి అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

- సురేష్ యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య

సిబ్బందికి అడ్మిషన్ల వేధింపులు


జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే సిబ్బందికి అప్పుడే అడ్మిషన్ల కష్టాలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 678 కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1,94,674 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. అధికారిక లెక్కల మేరకు 5,323 మంది టీచర్లు పని చేస్తున్నారు. అనధికారికంగా మరో 20 శాతం మంది ఉండే అవకాశం ఉంది. అయితే టీచర్లను కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు ఉత్పత్తి చేసే యంత్రాల్లా చూస్తున్నారు. ప్రతి టీచర్‌కు ముందస్తు అడ్మిషన్ల టార్గెట్ ఇస్తున్నారు. వచ్చే ఏడాది అడ్మిషన్లు చేయకుంటే ఉద్యోగాలు ఉండవంటూ హెచ్చరిస్తున్నారు. వారానికి హాస్టల్ అడ్మిషన్లు 2 లేదా 3, డేస్కార్ అడ్మిషన్లు సైతం 2 లేదా 3 తప్పనిసరిగా చేయాలి. ఫోన్లలో అడుక్కుంటారో.. లేక ఇల్లిల్లు తిరిగి చేస్తారో మాకు తెలియదు. మీకిచ్చిన టార్గెట్ పూర్తి చేయాల్సిందే అని వేధిస్తున్నారు. ఈక్రమంలోనే రెండో శనివారం, ఆదివారం కూడా సెలవులు ఇవ్వకుండా పాఠశాలలకు రప్పిస్తున్నారు. దీంతో కుటుంబాలను వదిలి వారం మొత్తం జీవితాలను పాఠశాలకే అంకితం చేయాల్సిన దుస్థితిని చాలా ప్రైవేట్ స్కూళ్ల సిబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇంతటితో ఆగక అడ్మిషన్ల టార్గెట్ చేయకుంటే జీతాలు నిలిపేస్తామని, కోత విధిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇచ్చే అరకొర జీతాల్లో కూడా కోత పెడితే ఎలా బతికేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు టీచర్లకు జీతాల్లో కోత పెట్టి, వాళ్లకు తోచినంత చేతిలో పెట్టినట్లు తెలిసింది.



ముందే.. బుక్స్, ఫీజులు

ముందస్తు అడ్మిషన్లు చేయడమే కాకుండా ఇప్పటికే స్కూళ్లలో ఉన్న పిల్లలు జారిపోకుండా ఫీజులు కట్టించుకుని, బుక్స్ అంటగట్టి ఇరికించుకుంటున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో డే స్కాలర్ విద్యార్థులకు రూ. 3500, హాస్టల్ విద్యార్థులకు రూ. 5,500 అడ్మిషన్ల ఫీజులుగా గుంజుకుంటున్నారు. పుస్తకాల కోసం అని రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకూ లాగేస్తున్నారు. 9 వ తరగతి పూర్తయిన విద్యార్థులకు పదో తరగతికి అడ్మిషన్‌ను ముందే కన్ఫర్మ్ చేసుకుంటున్నారు. అయితే చాలా కార్పొరేట్ స్కూళ్లలో 2025-26 అడ్మిషన్ల కోసం ఇప్పటి నుంచే పుస్తకాలు, అడ్మిషన్లు అంటూ కౌంటర్లు, దుకాణాలు తెరిచినా...జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారు.

నిద్రమత్తులో విద్యాశాఖ



2025-26 విద్యాఏడాది ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు మాఫియాను సాగిస్తున్నాయి. ముందుగానే అడ్మిషన్లు తేవాలంటూ టీచర్లను వేధిస్తున్నారు. రూ. 5,500 నుంచి రూ. 10,500 ఇలా అడ్మిషన్ల కోసం ఇప్పటి నుంచే ఫీజులు కట్టించుకుంటున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు మౌనంగా ఉండటం దారుణం. వీటిపై జిల్లా కలెక్టర్ స్పందించాలి.

- పరమేశ్వర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి



తనిఖీ చేయాలని ఆదేశిస్తా

విద్యా ఏడాది ముగియక ముందే కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. 2025-26 విద్యాఏడాది ప్రారంభం కాక ముందే ఏ పాఠశాలలో కూడా అడ్మిషన్లు చేయకూడదు. ఎక్కడ అడ్మిషన్లు చేస్తున్నా వెంటనే చర్యలు తీసుకుంటాం. డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖాధికారులకు ముందస్తు అడ్మిషన్లపై తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తా.

- ప్రసాద్ బాబు, డీఈఓ, అనంతపురం

కేసులు నమోదు చేయాలి



విద్యా సంవత్సరం ఇంకా రెండు నెలలు ఉండగా ఇప్పటి నుంచే రాబోయే ఏడాదికి అడ్మిషన్లు చేయాలంటూ పాఠశాల సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేయరాదంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా, వాటిని బేఖాతరు చేస్తూ విచ్చల విడిగా సాగిస్తున్నారు. ముందస్తు అడ్మిషన్ల కోసం ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలి.

- నరేష్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్ఎస్‌యూఐ

ఆందోళన చేస్తాం..



ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యా ఏడాది ఆరంభమైన తర్వాత అడ్మిషన్లు చేపట్టాలి. కానీ 2025-26 విద్యా ఏడాదికి ఇప్పటి నుంచి అక్రమంగా అడ్మిషన్లు చేయడం రూల్స్‌కు విరుద్ధం. ముందస్తు అడ్మిషన్ల కోసం టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. టార్గెట్లు పెట్టి వేధిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే డీఈఓ చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తాం.

- పాపిరెడ్డిపల్లి పృథ్వి, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి

సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి



విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కార్పొరేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ముందస్తు అడ్మిషన్ల కోసం సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అధికారులను సైతం శాసించే స్థాయిలో కార్పొరేట్ శక్తులు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రెగ్యులేటింగ్ కమిటీని తీసుకొచ్చి అడ్మిషన్లు, ఫీజుల వేధింపులపై టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులు స్వీకరించాలి.

- చంద్రశేఖర్, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం, జిల్లా అధ్యక్షుడు

రూ. 5 వేలు ఇప్పుడే కట్టాలట



జిల్లాలో పలు కార్పొరేట్ స్కూళ్లలో ఇప్పుడే అడ్మిషన్ల సందడి మొదలు పెట్టారు. విద్యా ఏడాది ముగియక ముందే...వచ్చే విద్యా ఏడాది అడ్మిషన్‌కు సంబంధించి రూ. 5 వేలు కట్టాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. జూన్‌లో చేయాల్సిన అడ్మిషన్లు ఇప్పుడే మొదలెట్టారు. ఫిబ్రవరిలోనే పుస్తకాలు కూడా కొనాలని ఒత్తిడి తెస్తున్నారు. టీచర్లకు టార్గెట్లు పెట్టి బెదిరిస్తున్నారు. విద్యాశాఖాధికారులు దీనిపై స్పందించాలి.

- కుల్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రైళ్లలో దొంగతనాలను కట్టడి చేయాలి: జీఆర్పీ ఐజీపీ

గుంతకల్లు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వేసవిలో రైళ్లలో దొంగతనాలను కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రైల్వే పోలీసు శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీపీ) కేవీ మోహన్ రావు పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన జీఆర్పీ, ఆర్పీఎఫ్, సివిల్ పోలీసు శాఖల అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ రైల్వేస్ ఐజీపీ మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రైళ్లలో దొంగతనాలు జరిగే ప్రాంతాలు, దోపిడీలకు పాల్పడే గ్యాంగులు, ఆ గ్యాంగులు ప్రయాణికులను దోచుకునే విధానం, తదితర అంశాలపై చర్చించారు. ఐజీపీ మాట్లాడుతూ బంగారం ధరలు ఆకాశాన్నంటినా వినియోగం తగ్గని కారణంగా స్వర్ణకారులు రైళ్లల్లో బంగారాన్ని తెస్తూ ఉంటారని, దోపిడీ ముఠాలు వారిని టార్గెట్ చేస్తాయని తెలిపారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడానికి రైళ్లల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ శాఖలు సమన్వయంతో గస్తీలను నిర్వహించాలన్నారు. అన్ని శాఖల సమన్వయం సాధించి రైళ్లల్లో నేరాలను కట్టడి చేయడమే బోర్డర్ క్రైం మీటింగ్ లక్ష్యమన్నారు. సమావేశంలో గుంతకల్లు డివిజన్ జీఆర్పీ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

అనంతా.. మభ్యపెట్టే మాటలు మానుకో...

జగన్‌రెడ్డికి భద్రత తగ్గించారనడం హాస్యాస్పదం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): 'మీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసినందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. ఆ విషయాన్ని మరచి మరోసారి ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడటం ఇకనుంచైనా మానుకోవాల'ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హితవు పలికారు. జగన్‌రెడ్డికి భద్రత తగ్గించారని కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... మిర్చి రైతులకు మద్దతు ధర లేదని గుంటూరు మిర్చి యార్డులో నిరసన చేయాలని జగన్‌రెడ్డి వెళ్లడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందన్న సంగతి ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అక్కడికి వెళ్లారే తప్ప... అక్కడ ఏం వెలగబెట్టారో చెప్పాలని నిలదీశారు. అధికారంలో ఉన్నపుడు మిర్చి రైతులకు రూపాయి మేలు చేశారా అని ప్రశ్నించారు. దౌర్జన్యంగా మిర్చి యార్డులోకి వెళ్లి అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వైసీపీ అధినేత జగన్‌రెడ్డికి సెక్యూరిటీ తీసేశామంటున్నారనీ, ఆయన మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయనకు సెక్యూరిటీ కల్పిస్తున్నామన్నారు. అమ్మఒడి పథకం ఇవ్వకుండా చేశారని పేటీఎం బ్యాచ్‌లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివే పాపతో అబద్ధాలు చెప్పిస్తే నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇలాంటి చిల్లర వేషాలు మానుకోవాలని ఆ పార్టీ నేతలను హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర నేత గాజుల ఆదెన్న, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్ పాల్గొన్నారు.

జగన్ ప్రజల్లో తిరగకూడదనే భద్రత కుదింపు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల్లో తిరగకుండా చేసేందుకే భద్రత కుదించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇల్లీగల్ యాక్టివిటీస్‌కు భద్రత కల్పించలేమని చంద్రబాబు చెప్పడం దుర్మార్గమన్నారు. రైతులను పరామర్శించటం చంద్రబాబు దృష్టిలో ఇల్లీగల్ యాక్టివిటీయా..? అని ప్రశ్నించారు. మిర్చి రైతులను జగన్ పరామర్శిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రాజకీయ విలువలు లేవా అని ప్రశ్నించారు. జగన్‌తో ఫొటో దిగిన చిన్నారిపై సోషల్ మీడియాలో టీడీపీ సైకోలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. అమ్మ ఒడి వస్తుందో... రాలేదో.. నారాయణ, చైతన్య స్కూళ్ల వద్ద అడిగినా చెబుతారన్నారు.



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సమస్యలు పరిష్కరించండి

డీఆర్ఎం సీఎస్ గుప్తాతో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అవసరమైన మేరకు నిధులు వచ్చేలా చేస్తామని, రైలు వంతెనల సమస్యను పరిష్కరించాలంటూ డీఆర్ఎం సీఎస్ గుప్తాను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి ఎంపీ, ఎమ్మెల్యే శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా డీఆర్ఎంతో పలు విషయాలు చర్చించారు. పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న ఆర్‌యూబీని వెడల్పు చేయడం, ధర్మవరం గేటు, హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న లైన్‌పై కొత్త ఆర్‌యూబీలను నిర్మించే విషయంగా చర్చించారు. ఈ వంతెనల వ్యయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని, సమస్యను పరిష్కరించాలని కోరారు. కొత్తగా నిర్మించనున్న బైపాస్ లైన్ కింద భూములు పోగొట్టుకుంటున్న గుంతకల్లు, కసాపురం, చిప్పగిరి గ్రామాల రైతుల సమస్యలపై చర్చించారు. ఈ విషయంగా స్థానిక ఆర్డీవో శ్రీనివాసులుతో సమావేశమై రైతులకు అన్యాయం జరక్కుండా సాగునీటి సౌకర్యమున్న భూములకు ఇచ్చే పరిహారాలను రైల్వే ఇచ్చేలా చూడాలన్నారు. కరోనా సమయంలో నిలిచిన రైళ్లను పునరుద్ధరించాలని, నరసాపూర్-ధర్మవరం రైలు గమ్యాన్ని గుంతకల్లు వరకూ పొడిగించాలని, హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ గుంతకల్లుకు అర్ధరాత్రి వస్తోందని, దాన్ని 3 గంటలు ఆలస్యంగా నడిపితే రాయలసీమ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, మష్టూరు తిమ్మప్ప, ముష్టూరు భాస్కర్, పూల రమణ, యూ ప్రభాకర్ పాల్గొన్నారు. .

నేడు 'పాల్'పై శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పర్సనలైజ్డ్ అడాప్టింగ్ లర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమంపై శనివారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 53 స్కూళ్లలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి, వారు నేర్చుకునే విధానాన్ని మెరుగుపర్చాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా గతంలో 32 కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లకు, గణితం, ఇంగ్లిష్, తెలుగు టీచర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. 15 మోడల్ స్కూళ్ల, ఆరు రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు శనివారం శిక్షణ ఇస్తామన్నారు. సంబంధిత ప్రిన్సిపాళ్లు, టీచర్లు విధిగా హాజరుకావాలన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ జగదీష్. పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరాతీశారు. సమీక్షలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేష్, సీఐలు శేఖర్, హేమంత్ కుమార్, శ్రీహర్ష, కరుణాకర్, కౌలుట్లయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

అపురూపం..!

సృష్టిలో అద్భుతం... కవలల బంధం

కష్టసుఖాల్లో ఒక్కటిగా.. ఒకరికొకరుగా..

నేడు కవలల దినోత్సవం

ఒకరు నవ్వితే..
మరొకరి మోములో
ఆనందం చిగురిస్తుంది..
ఒకరు ఏడిస్తే..
మరొకరి కళ్లు చెమరుస్తారు..
కష్టాలు.. కన్నీళ్లు..
సుఖాలు.. బాధలు..
అన్నీ పంచుకుంటారు..
అన్నింటా కలిసే ఉంటారు..
ఒక్కటిగా..
ఒకరికొకరుగా..
అదే కవలల బంధం..
సృష్టిలో అపురూప అనుబంధం..
అతి కొద్దిమందికే దక్కే భాగ్యం..

22నే ఎందుకు?

కవలల దినం ఫిబ్రవరి 22వ తేదీనే నిర్వహించడంలో ఓ ప్రత్యేకత ఉంది. ఫిబ్రవరి రెండో నెల. అందులోనూ 22వ తేదీలో రెండు రెళ్లు ఉంటాయి. కవలలు అంటే ఇద్దరు కావున, ఫిబ్రవరి 22వ తేదీన నిర్వహిస్తారు.

యాడికి, అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో అద్భుతం కవలల బంధం. ఒకే రూపం కలిగిన ఇద్దరు.. ఒకే ఇంటిలో ఉంటే దానిని అద్భుతం కాక ఏమంటారు? కొంతమంది కవల పిల్లల్లో ఎవరు, ఎవరో కనుక్కోవడం కష్టమే. అది కుటుంబ సభ్యులకే సాధ్యం. ఇద్దరు ఒకే పోలికలతో ఉండడం, ఒకే తరహా డ్రస్ వేసుకోవడం, వారి పేర్లు కూడా అన్నదమ్ముల పేర్లే పెట్టడం ఇలా అంతా ఒకేలా ఉండడం... అన్నీ గొప్ప అనుభూతులే. ఫిబ్రవరి 22వ తేదీన కవలల దినం నిర్వహించుకుంటారు. కవలలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కవలలు అంటే..

ఒకే కాన్పులో ఇద్దరు జన్మిస్తే వారిని కవలలు అంటారు. తల్లి ఒక ఆడ, ఒక మగ బిడ్డకు జన్మనివ్వవచ్చు. ఇద్దరు మగపిల్లలకు జన్మనివ్వవచ్చు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనివ్వవచ్చు. వైద్య పరిభాషలో ఒకే పోలికలతో ఉన్న కవలలను ఐడెంటికల్ ట్విన్స్ అనీ, వేర్వేరు పోలికలతో ఉన్న వారిని నాన్ ఐడెంటికల్ ట్విన్స్ అని పిలుస్తారు. కవలలను పెంచడంలో కొన్ని సమస్యలు ఎదురైనా వారి తల్లిదండ్రులు వాటిని ఆనందంగా స్వీకరిస్తుండడం గమనార్హం. కవలలుగా పుట్టిన వారిలో ఆప్యాయత, అనురాగాలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఒకరికి కష్టం వస్తే మరొకరు స్పందిస్తుంటారు.

పోలికలు సేమ్.. అలవాట్లు వేర్వేరు..

కవలలు ఒకే రూపంలో ఉన్నా.. వారి వేలిముద్రలు, కళ్లు మాత్రం వేరుగా ఉంటాయి. కొంతమంది కవలల ముఖకవళికలు ఒకేలా ఉన్నా వారి శారీరక బరువు వేర్వేరుగా ఉంటుంది. వారి ఆకృతి ఒకేలా ఉన్నా.. ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఇద్దరిలో రోగనిరోధక శక్తుల్లో కూడా తేడా ఉంటుంది.

అన్నింటా ముందంజ



అనంతపురంలోని కోవూర్‌నగర్‌కు చెందిన చిదానందమూర్తి, నిర్మల దంపతులకు కలిగిన కవలలు సందీప్, సంతోష్. వారి ఆలోచనలు, ప్రవర్తన ఒకేలా ఉంటాయంటున్నారు వారి తల్లిదండ్రులు. సందీప్ ఎంటెక్ పూర్తి చేసి, ప్రాజెక్ట్ అసోసియేట్‌గా పనిచేస్తున్నాడు. సంతోష్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతూ ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా ఉద్యోగం పొందాడు. వీరిద్దరూ చదువుతోపాటు అన్నింటా ముందంజలో ఉంటారంటున్నారు వారి తల్లిదండ్రులు.

దేవుడి వరం



అనంతపురానికి చెందిన జిలాన్‌బాషా, ఫక్రున్నీషా దంపతులకు పెళ్లైన ఎనిమిదేళ్ల వరకు సంతానం లేదు. ఆ తర్వాత కవలలు జన్మించారు. అది కూడా ఆడపిల్లలు. వారికి జిక్రా, బుష్రా అని పేర్లు పెట్టుకున్నారు. వారిరువురి అలవాట్లు ఒకేలా ఉంటాయంటున్నారు. చదువులో ఒకరికొకరు సాయం చేసుకుంటుంటారట. ఇంట్లోనూ తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఒకరిని మించి ఒకరు ప్రేమానురాగాలు కనబరుస్తుంటారు. కవల బిడ్డలు దేవుడిచ్చిన వరం అంటూ ఆ తల్లిదండ్రులు ఆనంద పడుతుంటారు.

నిర్ణయాలు కలిసే తీసుకుంటాం

రామ్‌లక్ష్మణ్, రాయలచెరువు



మాకు ఇప్పుడు 33సంవత్సరాలు. మా ఇద్దరి ఆలోచనలు, నిర్ణయాలు ఒకే విధంగా ఉంటాయి. ఏవీఎన్ నెట్ కేఫ్, ఏవీఎన్ మినరల్స్ నిర్వహిస్తున్నాం. ఏది చేసినా కలిసే చేస్తాం. ఇద్దరం ఒకేసారి కోప్పడతాం. కొద్దిసేపటికి సర్దుకుంటాం. లోకంలో దేవుడు ఇచ్చిన అద్భుత సృష్టి కవలలు. మా మధ్య ఏనాడూ విభేదాలు తలెత్తలేదు.

దేవుడిచ్చిన వరం

పవన్, ప్రభంజన్, యాడికి



కవలలుగా బతకడం దేవుడిచ్చిన వరం. మాకు ఇప్పుడు 28 సంవత్సరాలు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాం. ఏ సమస్య వచ్చినా ఇద్దరం పంచుకుంటాం. దుఃఖమైనా, సంతోషమైనా ఇద్దరం పంచుకుంటాం. బంధువుల ఇళ్లకు ఇద్దరం కలిసి వెళ్లినపుడు అందరూ చూసి ఆశ్చర్యపోతుంటారు. కొన్నిసార్లు ఎవరు ఎవరని గుర్తుపట్టలేకపోతుంటారు. మా మాట, నడవడిక ఒకేలా ఉంటాయి.

టమోటా రైతుకు మద్దతు

(5వ పేజీ తరువాయి)

విజయవాడ, గుంటూరు రైతు బజార్లకు తరలించారు. కాగా, స్థానికంగా ధరలు లేవని.. ఇతర ప్రాంతాలకు టమోటాలను తరలించి రైతులు మరింత నష్టపోయారు. రవాణా, కూలీల ఖర్చులు అదనంగా భరించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ పెట్టుబడులు..

శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలంలో ప్రధానంగా పండించే పంట టమోటా. ఇక్కడ రెండు వందల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో టమోటాలను సాగుచేశారు. నర్సరీలో ఒక్కో మొక్కను రూపాయి నుంచి ఒకటిన్నర రూపాయి వెచ్చించి కొనుగోలుచేస్తారు. కర్ర లను నాటి అధిక దిగుబడులు సాధిస్తారు. చీడపీడలను నివారించడానికి భారీగా ఖర్చు చేస్తారు. టమోటా మొక్కలకు వినియోగించే ఒక్కో నీలగిరి కర్రను రూ.30 వెచ్చించి కొంటారు. ఎకరానికి 14 వందల కర్రలు పడ తాయి. వీటికి దాదాపు రూ.50వేలు ఖర్చు వస్తుంది. కట్టెలకు బైన్‌ఫురి కట్టడానికి ఎకరా నికి మరో రూ.పది వేలు ఖర్చు అవుతుంది. పంట కోతకు వచ్చేసరికి ఎకరానికి ఎంతలే దన్నా రూ.లక్ష పెట్టుబడి అవుతుంది. దీనికి అప్పులు చేస్తారు. తీరా కోతకు వచ్చాక ధరలు పతనమౌతున్నాయి. ఏం చేయాలో, అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు ఆవే దన చెందుతున్నారు.

నష్టానికి అమ్మకం..

అనంతపురం జిల్లా కూడేరు మండలంలో దాదాపు 350 ఎకరాల్లో టమోటాను సాగు చేశారు. గార్లదిన్నె మండలంలో వందలాది ఎకరాల్లో టమోటా సాగైంది. గార్లదిన్నె, తిమ్మంపేట, మర్తాడు, సంజీవపురం, కొప్పల కొండ తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా టమోటా పంట కనిపిస్తుంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 325 ఎకరా లకు పైబడి టమోటా పంటను సాగు చేశారు. సాగు సమయంలో టమోటా ధర బాగానే ఉంది. అందుకే కష్టాలు తీరుతాయని రైతులు ఆశించారు. కానీ కోత సమయానికి పరిస్థితి తారుమారు అయింది. మార్కెట్‌కు తరలిస్తే కిలో రూ.8 పలుకుతోందని, ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 కేజీల బాక్స్‌కు రూ.125 ఇస్తున్నారని, ఈ ధర కూలీలకు, రవా ణాకు మాత్రమే సరిపోతుందని అంటున్నారు. చాలామంది రైతులు పంటను వదిలేయలేక మార్కెట్‌కు తరలిస్తున్నారు. నష్టాలకు అమ్ము కుంటున్నారు. మరికొందరు రైతులు పంటను పశువులకు వదిలేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖ కొనుగోలు

టమోటా ధరలు తగ్గుతుండటంతో మార్కె టింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ప్రారం భించారు. కళ్యాణదుర్గం మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీకాంత్‌రెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ టమోటాలను కొనుగోలు చేశారు. వీటిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని అధికారులు తెలి పారు. కిలో రూ.8తో 30 టన్నులు కొనుగోలు చేసి విజయవాడ, గుంటూరుకు పంపించారు.

తగ్గించేశారు..



మూడు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశాను. నాలుగు రోజుల క్రితం 16 కిలోల టమోటా బాక్స్ ధర రూ.200లకు అమ్ముడు పోయింది. ఇప్పుడు కేవలం రూ.100కు పడి పోయింది. ధర ఒక్కసారిగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

\- రామాంజనేయులు, మేళ్లకుంట

పెట్టుబడి కూడా చేతికిరాదు..



మూడు ఎకరాల్లో రూ.3 లక్షలు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేశాను. 16 కేజీల టమోటా బాక్స్‌ను మొన్నటివరకు రూ.200 ధర ఉండేది. ఇప్పుడు రూ.100కు పడిపో యింది. పెట్టుబడి కూడా చేతికి రాదు. ఇలా అయితే రైతులు ఎలా బాగుపడతారు..? ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

\- నరేష్, ఒంటారెడ్డిపల్లి

అమాంతం తగ్గిపోయింది..



నాలుగు రోజుల వ్యవధిలోనే టమోటా ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. బాక్సు రూ.100 పలుకుతోంది. ఇలా ధరలను తగ్గిం చేస్తే మాకు పెట్టుబడి కూడా దక్కదు. తోట ల్లోనే టమోటాను వదిలేసే పరిస్థితి వస్తోంది. మరికొన్ని రోజులు ఇవే ధరలు ఉంటే నష్టం తప్పదు.

\- రవి, ఒంటారెడ్డిపల్లి

నట్టేట మునగాల్సిందే..



ఈ సారి టమోటా పంటతో గట్టెక్కవచ్చు అనుకున్నాను. అన్ని పంటలనూ నష్టపో యాను. టమోటా కూడా ఇలా నష్టాలను తెస్తుందని అనుకోలేదు. ధర బాగుందని సాగు చేశాను. ఆనందం ఆవిరైపోయింది. రూ.100కు బాక్స్ అంటే నష్టాలు ఎదుర్కోక తప్పదు. టమోటా సాగు చేయాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- రామాంజి, మేళ్లకుంట

కూలి డబ్బులు కూడా రాలేదు..



రెండు ఎకరాల్లో టమోటా సాగు చేశాను. గతంలో ధర బాగుండటంతో మంచి జరు గుతుందని లక్షన్నర వరకు అప్పులు చేసి పెట్టు బడి పెట్టాను. దిగుబడి ఆశాజనకంగా ఉంది. కానీ మార్కెట్‌లో ధర పతనం కావడంతో అప్పులపాలయ్యాం. పొలంలో కాయలు తొలగించిన కూలీలకు కూడా డబ్బులు రాలేదు.

\- అంకె రామాంజినేయులు, కూడేరు

పశువులకు వదిలేశా..



మూడున్నర ఎకరాలలో రెండు లక్షల వరకు ఖర్చు చేసి టమోటా సాగు చేశాను. ధర పూర్తిగా పడిపోయింది. దిక్కుతోచక పశువు లకు వదిలేశాను. పంట కోస్తే కూలీల ఖర్చు భరించాలి కదా..? మార్కెట్‌కు తరలించే దుకు అదనపు ఖర్చు వస్తుంది. పంటను వదిలేస్తే నష్టం కొంతైనా తగ్గుతుంది. ప్రభుత్వం ఆదుకోకపోతే కోలుకోవడం కష్టం.

\- కుక్కపల్లి శివశంకర్, కూడేరు

గిట్టుబాటు కల్పిస్తున్నాం..



టమోటాను గిట్టుబాటు ధరతో కొనాలని అధి కారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో శుక్రవారం ఒక్క రోజే కిలో రూ.8 ప్రకారం వెయ్యి క్వింటాళ్ల టమోటాలను కొని రైతు బజార్లకు సరఫరా చేశారు. జిల్లాలో సేకరించిన టమోటాలను విజయవాడ, గుంటూరు రైతు బజార్లల్లో విక్రయిస్తారు. తద్వారా ఇక్కడి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. టమోటా కొరత ఉన్న రాష్ట్రల్లోనూ విక్రయించేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించారు. తద్వారా కిలో రూ.10 నుంచి రూ.15 వరకు రైతు లకు అందుతుంది.

\- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ప్రభుత్వమే కొంటుంది: పరిటాల సునీత



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

టమోటాకు గిట్టుబాటు ధరలు లేవని రైతులు ఆందో ళన చెందవద్దని, ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా ఇచ్చారు. ఆలమూరు సమీపంలో టమోటా పంటను ఆమె శుక్రవారం పరిశీలించారు. పెట్టుబడి, దిగుబడి, ధరల వివరాలను తెలుసుకున్నారు. గిట్టుబాటు కావడం లేదని, మార్కెట్‌లో 15కిలోల బాక్స్ రూ.50 నుంచి రూ.100 మధ్య పలుకుతోందని రైతులు ఆమెకు వివరించారు. కనీసం రూ.150 నుంచి రూ.250 మధ్య ధర ఉంటే తమకు గిట్టుబాటు అవు తుందని అన్నారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే మార్కె టింగ్, ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడారు. ఉత్త రాది నుంచి టమోటాలకు ఆదరణ తగ్గడంతో మార్కెట్‌కు రాక ఎక్కువై ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు ఆమెకు వివరించారు. దీంతో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ప్రభుత్వ గిట్టుబాటు ధరతో కొంటుందని ఆమె భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న రైతు బజా ర్లకు, ప్రాసెసింగ్ యూనిట్లకు జిల్లా టమోటాను పంపి, రైతులను ఆదుకుంటామని అన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: దగ్గుపాటి

రైతులకు ఆదుకునే ప్రభుత్వం మాది. టమో టాకు గిట్టుబాటు ధరను అందిస్తున్నాం. కిలో రూ.8 ప్రకారం కొనుగోలు చేసి రైతు బజార్లకు సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ధరలు తగ్గిన ప్పుడు రైతులు భారీగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని గమనించి, సీఎం చంద్రబాబు గిట్టుబాటు ధర కల్పించారు.

ఆదుకుంటాం: పల్లె సింధూర



టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటాం. ప్రస్తుతం ధర లేక రైతులు నష్టపోతున్నారు. వారిని ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కిలో రూ.8తో టమోటా లను సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు అందాయి. రైతులెవరూ అధైర్యపడవద్దు.

బాక్సు రూ.50 అంటున్నారు..

ఎకరం పొలంలో రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి టమోటా సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా ఉంది. దాదాపు 300 బాక్సుల



వరకు టమోటాలు వస్తున్నాయి. కానీ మార్కె ట్‌లో ధర పడిపోయింది. బాక్సు రూ.50 పలు కుతోంది. ఈ సొమ్ము కూలీలకు, బాడుగలకు సరిపోతుంది. అప్పులు చేసి పెట్టుబడులు పెడితే చివరికి అప్పులే మిగిలాయి.

\- బోయ రామాంజనేయులు, కూడేరు

ఏమీ మిగలదు..



ఆశించిన స్థాయిలో టమోటా దిగుబడులు వచ్చాయి. కానీ ధర రోజు రోజుకూ తగ్గుతోంది. ఎకరానికి రూ.70 వేలు చొప్పున ఖర్చు చేసి 4 ఎకరాలు టమోటా పంటను సాగుచేశాను. నాలుగు రోజుల క్రితం 15 కేజీల బాక్స్ రూ.150 ఉండేది. ప్రస్తుతం రూ.125కి పడిపోయింది. దీంతో వలమనేరు మార్కెట్‌కు తరలిస్తున్నాం. ప్రస్తుత ధరకు అమ్మితే కూలీలకు, రవాణా ఖర్చులు, కమీషన్ పోనూ మాకు మిగిలేది ఏమీ ఉండదు. వర్తీషమ్ నుంచి మార్కెట్‌కు టమోటాలు ఎక్కువగా వస్తు న్నాయి. అందుకే ధర పడిపోయింది.

\- సుధాకర్‌రెడ్డి, తిమ్మంపేట

ఫెఫ్టీ.. ఫెఫ్టీ ..!



బొమ్మనహాళ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'నీకు సబ్సిడీ లోన్ ఇప్పిస్తా. అందులో నాకు సగం ఇవ్వాలి? నాకు బ్యాంకు అధికారులే కాక, బీసీ కార్పొరేష న్, మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు అందరూ బాగా తెలుసు. నేను ఎవరికి చెబితే వారికే లోన్ వస్తుంది'. అంటూ మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ఓ మీసేవ కేంద్రం నిర్వాహకుడు నిరుద్యోగులను మోసం చేస్తున్నాడు. ఇప్పటికే చాలా మంది అతడి ఉచ్చులో పడినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. రూ. లక్ష, రెండు లక్షలు, ఐదు లక్షల వరకు యూనిట్‌ను బట్టి రుణం మంజూరు చేయనున్నారు. ఈక్రమంలో మండలానికి 47 యూనిట్లు మంజూరయ్యాయి. వీటి కోసం 322 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రుణ మంజూరు కోసం శుక్ర, శనివారాల్లో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 50 శాతం సబ్సిడీ కావడంతో ప్రతి ఒక్కరూ లోన్ కోసం తపిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న ఆ మాయగాడు దరఖాస్తుదారులను తన వలలో వేసుకుంటున్నాడు. లోన్ వచ్చిన తర్వాత సబ్సిడీ సొమ్ము చెరో సగం పంచుకుందామని చెబుతున్నాడు. అంతకంటే ముందు కొన్ని ఖర్చులు ఉంటాయి కాబట్టి కొంత సొమ్ము చెల్లించాలని వారితో రాబట్టుకుంటున్నాడు. ఒక్కొక్కరి నుంచి రూ. వెయ్యి, రూ.1500 వసూలు చేస్తున్నాడు. లోన్ వచ్చేలా చేస్తామంటే వెయ్యి ఏంటీ.. రెండు వేలు అయినా ఇస్తామంటూ కొంతమంది రెండువేల వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయం అధికారులెవరికీ తెలియకపోవడంతో మీ సేవ నిర్వాహ కుడి ఆగడాలు రోజురోజుకీ మితిమీరి పోతున్నాయి. అధికారులు స్పందించి అమాయ కులు అతడి ఉచ్చులో పడి మోసపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మాయమాటలు నమ్మొద్దు: విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

సబ్సిడీ రుణాలను ఇప్పిస్తామని చెప్పే దళారుల మాయమాటలు నమ్మి మోసపో వద్దు. బ్యాంకర్లు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరైతే అర్హత కలిగిన వారికే రుణాలు అందుతాయి. గ్రామాల్లో అమాయకుల అవసరాలను ఆసరా చేసుకొని ఎవరైనా వసూ ళ్లకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

అంతర్జాతీయ పోటీలకు యాడికి వాసి



అబుదాబిలో బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ విజయ్

యాడికి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): దుబాయ్ లోని అబుదాబిలో నిర్వహిస్తున్న 47వ ఐఎస్‌సీ-ఆపెక్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన విజయ్ పాల్గొంటు న్నాడు. స్థానిక కోటవీధికి చెందిన విజయ్ తండ్రి నాగేంద్ర ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తు న్నారు. విజయ్‌ను తండ్రి చిన్నప్పటి నుంచి బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రోత్సహిస్తూ వచ్చారు. విజయ్ పలు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాడు. ప్రస్తుతం దుబాయ్‌లోని అబుదా బిలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఐఎస్‌సీ-ఆపెక్స్ మీట్‌లో పాల్గొనడానికి వెళ్లాడు. ఈనెల 24 వరకు నిర్వహించే పోటీల్లో భారత్ తరఫున పాల్గొననున్నాడు.

28న ప్రతి స్కూల్‌లో సైన్స్ డే

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి స్కూల్‌లో ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ డే వేడుక నిర్వహించాలని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్కూళ్లలోని ఐఎస్‌టీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు వినియోగించుకుని ప్రఖ్యాత శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, వారి ఆవిష్కరణలు, ఇస్రో సాధించిన విజయా లపై ఆ రోజు స్కూళ్లలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైన్స్ క్విజ్, పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్, నాటికలు, 'ప్రపంచ గతిని మార్చిన సైన్స్ ఆవిష్కరణలు' అన్న అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా సైన్స్ దినోత్సవాలపై జిల్లా సైన్స్ అధికారి నివేదిక ఇవ్వాలని డీఈఓ ఆదేశించారు.

చీనీ టన్ను రూ. 22వేలు



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,220 పలికి నట్టు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 7వేలు, సరాసరి రూ. 12,500తో అమ్ముడు పోయినట్టు తెలి పారు. మార్కెట్‌కు మొత్తం 130 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

డీహీరేహాళ్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపాన 50 ఏళ్ల పైబడిన గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివ రాల మేరకు.. హిర్దేహాళ్ సమీపాన బళ్లారి-రాయదుర్గం రోడ్డులో చర్చి వద్ద రెండురోజు లుగా మతిస్థిమితం లేని వ్యక్తి సంచరిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అటుగా పొలాలకు వెళ్లేవారు. ఆ వ్యక్తి పడి ఉండడాన్ని గమనించారు. అక్కడికి వెళ్లి చూడగా అతడు మరణించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి.. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించారు. అతడు స్థాని కుడు కాదని తెలిసింది. పోలీసులే ఖననం చేశారు.

బస్సు బోల్తా.. 20మందికి గాయాలు

గుత్తి ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు



బోల్తాపడిన బస్సు

గుత్తి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా జొన్నగిరి శివారులో ప్రైవేట్ బస్సు బోల్తా పడటంతో గాయపడిన 20మందిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స అందించారు. జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకుని ఈనెల 6న హిందూపురం నుంచి 44 మంది ప్రయాణికులు వివిధ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం బయలుదేరారు. కుంభమేళా, మంత్రాలయం తదితర ప్రాంతాలను సందర్శించి తిరిగి హిందూపురం బయల్దేరారు. జొన్నగిరి సమీపంలోకి రాగానే బస్సు ముందు టైర్ పేలింది. దీంతో బస్సు అదుపు తప్పి పంటపొలాల్లో బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం విద్యుత్ నగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ వినోద్‌కుమార్, అనంతపురం బ్రాహ్మణపల్లికి చెందిన తులసి, కర్ణాటక రాష్ట్రం బసవనపల్లికి చెందిన లక్ష్మయ్య, అనంతపురానికి చెందిన వన్నూర్‌స్వామి, కర్ణాటక బెంగళూరు రూరల్ తాలూకా గుండంగికి చెందిన నాగరాజాచారి, నాగలక్ష్మి, చంద్రశేఖర్, జయలక్ష్మి, ప్రేమమ్మ, కర్ణా టక రాష్ట్రం బలసముద్రానికి చెందిన ఆదెమ్మ, హనుమంతప్ప, దొడ్డబ ళ్లాపూర్‌కు చెందిన ఆదెక్క, టుంకూరుకు చెందిన పుష్పావతి, అనం తపురానికి చెందిన ప్రమీల, వన్నూర్‌స్వామి, మహాలక్ష్మి, ఉమాదేవి గాయపడ్డారు. క్షతగాత్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో తులసి, పూర్ణావతి, ఆదెమ్మ, లక్ష్మన్న పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్ర జ్యోతి): జీవితంపై విరక్తి చెంది మండ లంలోని దామాజిపల్లిలో నయ్యద్‌బాషా (40) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నయ్యద్‌బాషా తాగు డుకు బానిసయ్యాడు. వ్యసనాన్ని మానుకోలేక మానసికంగా వేదన చెందాడు. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి ఇంటి సమీపంలోని పశువుల పాక వద్దకెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో అతడి తండ్రి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కని పించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో ఉరి నుంచి కిందకు దించి చెన్నే కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నయ్యద్ బాషాకి భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు. బాషా తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట



జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లాకు చెందిన పారా అథ్లెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహించారు. నీలం పల్లవి షాట్‌పుట్‌లో రజతం, నీలం సంజయ్‌రెడ్డి షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో కాంస్య పతకాలు సాధించారు. సాకే బాబు డిస్క్ స్త్రో, షాట్‌పుట్‌లో రజతం వైజనం చేసుకున్నారు. కురుబ సహన షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రజతాలు సాధించింది. షేక్ అల్లావలీ 400 మీటర్ల పరుగులో రజతం, వెంకటేష్ కాంస్య పతకాలు సాధిం చారు. వారిని జిల్లాకు చెందిన పలువురు అభినందించారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి ఆరో తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 20న పరీక్షలు ఉంటాయని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూళ్లలోనే నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఆన్‌లై న్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 31వతేదీ వరకూ నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయో గించి పేమెంట్ గేట్ వే ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. ఫీజు చెల్లించిన తర్వాత వచ్చే జనరల్ నంబర్ ఆధారంగా www.cse.ap.gov.in, www.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

ముగ్గురు వైద్యుల తొలగింపు

అనంతపురం టౌన్, ఫిబ్రవ రి21(ఆంధ్రజ్యోతి): విధిక దా జాలు చూపి ఏళ్లుగా విధులకు దుమ్మా కొడుతున్న ప్రభుత్వ వైద్యులపై సర్కారు కొరడా ఝుళిపించింది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది డాక్టర్లు ఏళ్ల తర బడి డ్యూటీలకు రావడంలేదు. దీనిపై లోకాయుక్తకు ఫిర్యా దులు వెళ్లాయి. విచారణ చేసిన లోకాయుక్త అలాంటి డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభు త్వాన్ని కోరింది. దీంతో రాష్ట్రవ్యా ప్తంగా ఏళ్ల తరబడి సమా చారం ఇవ్వకుండా డ్యూటీలకు రానివారి సమాచారం సేకరిం చారు. మొత్తం 55మంది డాక్ట ర్లున్నట్లు తేలడంతో వారంద రినీ సర్వీస్ నుంచి తొలగిస్తూ శుక్రవారం రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అందులో అనంత మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు డాక్టర్లు ఉన్నారు. డాక్టర్ సునీత (న్యూరాలజీ), డాక్టర్ భరత్‌కుమార్ (సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ విజ యవాణి (పీడియాట్రిక్) మూడేళ్లుగా డ్యూటీలకు రావ డంలేదు. ఆ ముగ్గురు డాక్టర్లు తొలగింపు జాబితాలో ఉన్నారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలి పారు.

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును

శ్రీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్న మీ బంగారంకి అధిక ధర చెల్లించబడును. గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA-226835

WANTED

అనంతపురం టౌన్ నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ కావలెను. ms office నందు అనుభవం కలిగి ఉండాలి. ఆడవారికి మాత్రమే. ఫోన్ నెంబర్: 9381838140.

AJA-226826

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లకు ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్‌లకు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటి

ఆంధ్రజ్యోతి

ద్వారా మిమ్మలను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

Advertisements

జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల ప్రత్యేక ప్రకటనలకు మీ సమీపంలోని మా ప్రతినిధిని సంప్రదించండి

యాడ్స్ డిపార్ట్‌మెంట్ :
99854 11165, 99854 11179, 9900167475,

పై ప్రకటనలపై GST 5% వర్తించబడును.

అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి విలేకరుని సంప్రదించండి.

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్



ఫిబ్రవరి నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు :
డోర్ నంబరు :
వీధి పేరు :
గ్రామం / పట్టణం :
మండలం :
జిల్లా :
పోస్టల్ పిన్‌కోడ్ :
ఫోన్ నంబర్ :

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది ఫిబ్రవరి నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి 2025 మార్చి నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి, 239-2ఏ, బైపాస్‌రోడ్, కక్కలపల్లి క్రాస్
అనంతపురం -515001
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 9985411154
బ్రాంచ్ మేనేజర్: 9985411151

ఈ-పంట నమోదు పక్కాగా నిర్వహించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్ ● సూపర్ చెక్ పరిశీలన



సోములదొడ్డిలో సూపర్ చెక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కలెక్టర్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ పంట నమోదు పక్కగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని కందుకూరు, సోములదొడ్డి గ్రామా ల్లో ఈ - క్రాప్ బుకింగ్ సూపర్ చెక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముం దుగా కందుకూరులో వై మురళీకృష్ణ సాగు చేసిన మొక్క జొన్న పంట ఈ- క్రాప్ బుకింగ్‌లో కలెక్టర్ సూపర్ చెక్ నిర్వహించారు. అనం తరం సోములదొడ్డి గ్రామ పరిధిలోని రఘురాములు సాగు చేసిన వరి పంట ఈ క్రాప్ బుకింగ్‌ను సూపర్ చెక్ చేశారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ... రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదును పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే సూపర్ చెక్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీ రవికుమార్, తహసీల్దార్ హరికుమార్, మండల వ్యవసాయాధికారి శశికళ, బాలనాయక్, ఏఈఓ మురళీకృష్ణ, ఆర్ఐ సందీప్, వీఆర్వోలు గోవిందు నాయక్, సర్వేయర్ రఘు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్ చదివి... బాడీ బిల్డర్‌గా రాణింపు

సౌత్ ఇండియా పోటీల్లో సత్తాచాటిన శివతేజ



బాడీ బిల్డర్‌గా రాణిస్తున్న శివతేజ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీటెక్ చదివా డు... సాఫ్ట్‌వేర్ అవుతాడని తల్లిదం డ్రులు అనుకున్నారు. అయితే అత డు బాడీబిల్డింగ్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన బిల్డర్లతో పోటీపడి సత్తాచాటుతున్నాడు. అ నంత జిల్లాకు పేరుప్రతిష్ఠలు తీసుకొస్తుండడంతో ఆ తల్లిదండ్రు ల ఆనందానికి అడ్డు లేకుండా పోతోంది. అనంతపురం నగరానికి చెందిన నాగేంద్ర జిల్లా వైద్యశాఖ మలేరియా విభాగంలో రాయదు ర్గం మలేరియా సబ్‌యూనిట్ అధి కారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సతీమణి అరుణ విడపనకల్ మండలం పెద్దకొట్టాల పల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గణిత ఉపా ధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడ శివతేజను అందరి తో పాటు బాగా చదివించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చూడా లనుకున్నారు. బీటెక్ చేయించారు. శివతేజ మంచి పర్సెంటేజీతో ఉత్తీర్ణత సాధించాడు. అతడు సాఫ్ట్‌వేర్ వైపు చూడలేదు, బాడీబిల్డర్‌గా వెళ్లాలని అనుకున్నాడు. తల్లిదండ్రులు తొలుత ఆలోచించుకోమని



తల్లిదండ్రులతో శివతేజ

చెప్పినా మారలేదు. దీంతో తల్లిదండ్రులు కొడుకు ఆసక్తి మేరకే ప్రోత్సహిస్తున్నారు. నాలుగేళ్లుగా శివతేజ ఆన్‌లైన్‌లోనే ఢిల్లీ మాస్టార్‌తో బాడీబిల్డింగ్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఇపుడు బాడీ బిల్డర్ పోటీలలో పాల్గొంటున్నాడు. ఇప్పటికే రాష్ట్రంతోపాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, గోవారాష్ట్రాలలో జరిగిన పోటీలలో పాల్గొని తన సత్తా చాటుతున్నాడు. తాజాగా తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన మిస్టర్ సౌత్‌ఇండియా బాడీబిల్డింగ్ 80కేజీల విభాగంలో మన రాష్ట్రం తరఫున పాల్గొన్నాడు. ఈ పోటీలలో ఆయా రాష్ట్రాల బాడీబిల్డర్లతో హోరా హోరీగా తలబడి ఐదో స్థానం దక్కించుకున్నాడు. వైద్యశాఖ అధికారులు, సిబ్బంది బాడీ బిల్డర్ శివతేజను అబినందించారు. ఇలా శివతేజ బాడీ బిల్డర్‌గా అనంత జిల్లాకు వన్నె తెస్తున్నారు. ఈ సందర్భంగా శివతేజ మాట్లాడుతూ ఎంచుకున్న రంగంలో జాతీయస్థాయిలో ఉత్తమస్థానం సంపాదించాలనేదే తన లక్ష్యమన్నాడు. అందుకు ఎంత శ్రమనైనా భరించి అకుంఠతదీక్షతో ముందుకుసాగుతానని పేర్కొన్నాడు.

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

గార్లదిన్నె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చునని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అక్షర స్కూల్లో నారాయణ వి ద్యా సంస్థల జిల్లా స్థాయి క్రీడో త్సవాలు నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఏజీఎంలు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యం విషయంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుక్కరాయసముద్రం మండలం జంతులూరుకు చెందిన దూదేకుల కరీంబీకి మంజూరైన రూ.5.37 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన శుక్రవారం నగర శివారులోని తన నివా సంలో ఆమెకు అందజేశారు.

'ఫార్మసీ సైంటిస్టులుగా జేఎన్టీయూ విద్యార్థులు'





మాట్లాడుతున్న రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, నృత్యం చేస్తున్న విద్యార్థిని

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో దేశ ఖ్యాతిని చాటిన జేఎన్టీయూ ఫార్మసీ... విద్యార్థులను సైంటిస్టులుగా తీర్చిదిద్దుతోందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య పేర్కొన్నారు. జేఎన్టీయూ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన కళాశాల (ఓటీఆర్ఐ)లో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ సుబ్బారెడ్డి అధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకులకు రిజిస్ట్రార్ క్రిష్ణయ్య ముఖ్య అతిథులు గా హాజరై ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక వేడుకల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ గోపీనాథ్, డీఆర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నిత్యజీవితంలో సైన్స్ మమేకమై ఉందని విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కల్గిఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టింబక్టుకలెక్టివ్ స్వచ్ఛందసంస్థ సహకారంతో చిగురు ఆధ్వర్యంలో శుక్రవారం సైన్స్‌డే నిర్వహించారు. ఉన్నతపాఠశాల, కేజీబీవీ, మోడల్‌స్కూల్ ప్రకృతి బడి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

న్యాయం జరిగేలా చూడండి

● ఎమ్మెల్యే పరిటాల సునీతకు అగ్రిగోల్డ్ బాధితుల వినతి



ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని మండలంలోని పలువు రు బాధితులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ బాధితులతో పాటు అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేని నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. బాధి తులకు తగు న్యాయం జరిగేలా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బాధితులు కుళ్లాయప్ప, అల్లీపీరా, రాజశేఖర్‌రెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ పల్లి రోడ్డు పరిశీలన

అనంతపురంరూరల్ మండలపరిధిలో మండలంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలమూరు- ఎంబీపల్లి ప్రధాన రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత పరిశీలించారు. ఆమె శుక్రవారం సాయంత్రం టీడీపీ మండల, స్థానిక నాయకులతో కలసి పనులను పరిశీలించారు. రూ.2.50కోట్లతో 4.50కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు, సీపీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే... స్వల్ప అనారోగ్యానికి గురై నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స పొందుతున్నటీడీపీ మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల సీనియర్ ఆలమూరు సూరి. మారినేని నారాయణస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈఓల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్తా

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసే విష యాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పరిటాల సునీత హామి ఇచ్చారు. ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఉపాధ్య క్షురాలు భాగ్యలక్ష్మి, అపర్ణ, ప్రశాంతి శుక్రవారం నగరంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో ఎమ్మె ల్యేని కలిసి తమ సమస్యలను వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి, వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి, పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

రాప్తాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయ పల్లి పంచాయతీ పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో శనివారం ఉదయం 11 గంటలకు సీసీ రోడ్ల నిర్మాణా భూమి పూజ కార్యక్రమంకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి హాజరవుతారన్నారు. సీసీ రోడ్లు నిర్మాణంకు జిల్లా పరిషత్ 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 40 లక్షలు నిధులు మంజూ రయ్యాయని ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తార న్నారు. ఈ కార్యక్రమంకు అధికారులు, ప్రజలు హాజరుకావాలన్నారు.

శాశ్వత నియామకాలు చేపట్టాలి

● మార్చి 3న పార్లమెంట్ ఎదుట ధర్నా, 24, 25 తేదీల్లో సమ్మె
● యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు



సాయినగర్ ఎస్‌బీఐ శాఖ ఎదుట ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా అన్ని జాతీయ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి శాశ్వత ఉద్యోగా ల నియామకాలు చేపట్టాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూని యన్స్ నాయకులు డిమాండ్ చేశారు. మార్చి 24, 25వ తేదీల్లో చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక సాయి నగర్ లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, శాశ్వత ఉద్యోగాల నియామకాలు చేపట్టాలన్నారు. సమస్యలపై మార్చి 3వ తేదీన ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ధర్నా, అలాగే దేశ వ్యాప్తంగా సు మారు 10లక్షల మంది భాగస్వామ్యంతో మార్చి 24, 25వ తేదీల్లో చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఖాదర్‌బాషా, చంద్ర మోహన్, నరేంద్ర, రాఘురామ్ యాదవ్, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కమలానగర్‌లోని బ్యాంకు ఆఫ్ బరోడా వద్ద అనంతపూర్ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మం నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ జిల్లా కార్య దర్శి సంజయ్‌రామ్ మాట్లాడారు. ఆ సంఘం నాయకులు భరత్, సునీత, అరవింద్, శ్రీకాంత్, చంద్రమౌళి, మురళి, శ్వేత పాల్గొన్నారు. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న కెనరాబ్యాంకు ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కెనరాబ్యాంకు వర్క్‌మెన్ ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మున్వర్‌బాషా మాట్లాడారు. ఆ సంఘం నాయకులు రమణరాజు, హరీష్, బయన్న, మునిగోపాల్, నంజుండస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై కైలాసవాసుడు



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజున శుక్రవారం స్వామివారు శేషవాహనంపై ఊరేగాడు. ఆలయంలో ఉదయం మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

గ్రూప్-2 పరీక్ష ఏర్పాట్ల పరిశీలన



పరీక్షా కేంద్రంల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ్ శర్మ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా ఆదివారం జిల్లాలో జరగనున్న గ్రూప్- 2 పరీక్షలకు ఏర్పాట్లను జా యింట్ కలెక్టరు శివనారాయణశర్మ పరిశీలించారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీ లించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలకు సంబం ధించిన ఏర్పాట్లు శనివారాకి పూర్తికావాలన్నారు. కేంద్రాలు ఉన్న ప్రతి కళాశాలలోను సీసీకెమెరాలు ఏర్పాటుచేసి, అన్నీ పనిచే సే లా చూడాలన్నారు. పరీక్ష రోజు ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమ లుచేయాలని, సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించా లని పోలీసులకు సూచించారు. పరీక్షలకు హాజయర్యేందుకు వచ్చే అభ్యర్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి నుంచి మూడో స్థానంలో మన పనితీరు

● డాక్టర్ల సమావేశంలో ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న ఐవీఎస్ఆర్ సర్వేలో మన పనితీరు, అందిస్తున్న వైద్యసేవల పట్ల రోగులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాల రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 16 కళాశాలలు ఉంటే అందులో ఆఖరి నుంచిమూడో స్థానంలో ఉన్నామ అన్నారు. ఆయన శుక్రవారం కళాశాలలోని సమావేశమందిరంలో వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు తప్పక సమయపాలన పాటించాలన్నారు. రోగులపట్ల మానవతా దృక్పథం చూపిస్తూ వైద్యం అందించాలన్నారు. ఇక్కడ డాక్టర్లు అలా వ్యవహరించడంలేదనే ఐవీఆర్ఎస్ సర్వేలో వ్యక్తం చేశారన్నారు. ఎవరూ సమస్యల్లో ఇరుక్కో వద్దని సూచించారు. అలాగే మెడికల్ కళాశాల 25 వసంతాల వేడుకలు జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందరూ మంచిగా పనిచేసి ఆస్పత్రికి పేరు తీసుకొద్దామని డాక్టర్లకు ప్రిన్సిపాల్ హితబోధ చేశారు. సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. డాక్టర్లు మంచిగా పనిచేసినపుడే ఆస్పత్రికి గౌరవం పెరుగుతుందన్నారు. నాన్ మెడికల్ సిబ్బంది, ఎంఎన్ఓలు రోగులనుంచి డబ్బులు వసూలు చేసినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి, అన్నివిభాగాల హెచ్ఓడీలు, ప్రొఫె సర్లు , అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అనంతకు నిధులు తీసుకురావాలి : మేయర్

అనంతపురం క్రైం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): నగరంలో సమస్యల పరిష్కారం కోసం బడ్జెట్‌లో అదనంగా నిధులు రాబట్టే విషయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నడిమివంకకు ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీలు ఇచ్చారన్నారు. వెనక్కు వెళ్లిన నిధులను తీసుకురావాలన్నారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దుచేయాలి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సులకు ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దుచేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీఓ 77 రద్దు, వర్సిటీలకు ప్రవేశాల అధికారాలు అనే అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్వీఐవీ, వైఎ స్సార్ ఎస్‌యూ, విద్యార్థి సమాఖ్య తదితర విద్యార్థి సంఘాల సం యుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయాసంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వేమన, శివకుమార్, కుళ్లాయిస్వామి, అశోక్, రామన్న, చంద్రశేఖర్, సురేష్, బాలక్రిష్ణ, మంజునాథ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను చాటేలా క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి వున్న పత్రిభను చాటేందుకు క్రీడా పోటీలు దోహదం చేస్తాయని ఎస్కేయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఈ) డాక్టర్ లోకేష్ పేర్కొ న్నారు. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆరు రోజులపాటు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. మొదటి రోజైన శుక్రవారం డాక్టర్ లోకేష్ టాస్‌ను ఎగురవేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ తది తరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఆహార భద్రత అధికారుల దాడులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బుక్కరా యసముద్రంలోని జంతులూ రులో ఉన్న బియ్యం దుకాణాలపై ఆహార భద్రత శాఖాధికారులు దాడులు నిర్వహించారు. నాణ్యత లేని బియ్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో జిల్లా ఆహార భద్రతాధికారి కళ్యాణచక్రవర్తి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీం సిబ్బందితో వెళ్లి బియ్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వారు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాప్తాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్ల పర్తి, హంపాపురం సబ్ స్టేషన్‌లలో విద్యుత్ తీగలు కొత్తవి అమర్చు తున్నందున పలు గ్రామాల్లో విద్యుత్ సరఫా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ శివప్రసాద్ పత్రికా ప్రకటనలో తెలిపారు. రామినేపల్లి, రాప్తాడు, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, పుల్లల రేవు, బొమ్మేపర్తి, అయ్యవారిపల్లి, లింగనపల్లి, గాండపర్తి, కొత్తపల్లి, బుక్కచెర్ల, బండమీద పల్లి, వరిమడుగు, యర్రగుంట గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

యూనిక్ నంబర్ నమోదు చేసుకోండి

రామగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న రైతులు తప్పక యూనిక్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలని ఏఓ కవిత శుక్ర వారం ఒకప్రకటనలో తెలిపారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి యూనిక్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలని ఏఓ తెలిపారు.

రూ.13 లక్షల శనగలు అమ్మేశాడు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): టన్నుల కొద్దీ శనగలు అమ్మేశాడు. కానీ డబ్బులివ్వకుండా ఓ మహిళను చం పుతానని బెదిరించిన ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన భానుమతి స్థానిక రైతుల నుంచి 237 టన్నుల శనగలు సేకరించింది. వాటిని తన అన్న కొడుకైన, అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉంటున్న యశ్వంత్‌కు అందజే సింది. వాటిని ఈనెల 14వ తేదీ అనంతపురంలోని కాశీవిశ్వనాథ్ గోడౌన్‌కు రూ.13లక్షలకు అమ్మేశాడు. కానీ ఆ డబ్బు భానుమ తికి ఇవ్వలేదు. ఫోన్ చేసినా స్పందించేవాడు కాదు. ఈ క్రమంలో తెలిసిన వారి నుంచి ఫోన్ చేస్తే, భానుమతిని తిట్టా డని, చంపుతానని బెదిరించాడని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యశ్వంత్, దివాకర్ తనకు డబ్బు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొనడంతో వారిద్ద రిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ యువకుడు మద్యానికి బానిసై ఆ అలవాటు మానలేక ఆత్మ హత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన సాయి(26) గాయత్రిని కొన్నేళ్ల క్రితం ప్రేమవి వాహం చేసుకున్నాడు. వారికి మూడేళ్ల కుమారుడు. తొలుత మెడికల్ ఏజెన్సీలో పనిచేసేవాడు. ఈ క్రమంలో మద్యా నికి అల వాటుపడ్డాడు. అప్పటి నుంచి సరిగా పనికి వెళ్లేవాడు. మద్యం మానుకోవాలని కుటుంబసభ్యులు చెప్పేవారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి కేసులో రిమాండ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఓ మహిళపై వేటకొడవలితో దాడి చేసిన ఘటనలో నిందితుడు బాల ఓబుళేసును వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. గురువారం రాత్రి హేమలతను పాతూరులో బాల ఓబుళేసు అనే వ్యక్తి వేటకొడవలితో నరికాడు. ఆమెను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై బాల ఓబుళేసుపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు పంపారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు డ్రా

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గుత్తి పట్ట ణంలో ఓ వృద్ధుడిని ఏమార్చి, అతడి ఏటీఎంను తీసుకున్న ఓ దుండగుడు రూ.50వేల నగదు డ్రా చేశాడు. గొల్లలదొడ్డి గ్రామా నికి చెందిన పూజారి రామాంజినేయులు అనే వృద్ధుడు డబ్బు డ్రా చేసుకోడానికి శక్రవారం గుత్తి ఎస్బీఐ ఏటీఎం కేంద్రానికి వెళ్లాడు. అక్కడున్న ఓ దుండగుడు డబ్బు డ్రా చేసివ్వాలా అంటూ నటించి...వృద్ధుడితో ఏటీఎం కార్డు తీసుకుని, దానిని మార్చేశాడు. సర్వర్ పనిచేయడం లేదని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఆ గుర్తు తెలియని వ్యక్తి మరో ఏటీఎం నుంచి ఆ వృద్ధుడి ఏటీఎం ఉపయోగించి రూ. 50వేలు డ్రా చేసుకున్నాడు. ఇంటికెళ్లాక డబ్బు డ్రా చేసుకున్నట్లు మెసేజ్ రావడంతో, శుక్రవారం రాత్రి పోలీసులను ఆశ్రయించాడు. పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

నార్పల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందల వాడ, బీ పప్పూరు గ్రామాల్లోని చెత్తసంపద కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రల చుట్టూ మొక్కలు నాటాలన్నారు. చెత్త సంపద కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈఓఆర్డీ శైలజ రాణి, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు, తదితరులుపాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం

అనంతపురంరూరల్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆలమూరు రోడ్డులోని ఎస్ఎల్ఎన్ స్నాతక మహిళా కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిం చారు. పలువురు వక్తలు హాజరై తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు. కళాశాల ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఆనంద్, ప్రధానాచార్యులు రామిరెడ్డి, తెలుగు ఉపన్యాసకురాలు అరుంధతి, సాయికృష్ణ, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

● కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటశివారెడ్డి



విస్తృతంగా ప్రచారం చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు అమలు చేసే సేవలను సద్వినియోగం చేసుకోవాలని గార్లదిన్నె కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటశివారెడ్డి ఖాతాదారులకు సూచించారు. శుక్రవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామాల్లో బ్యాంకు అధికారులు ఇంటింటా తిరుగుతు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, సేవలను ఖాతాదారులకు తెలియజేశారు. మేనేజర్ వెంకటశివారెడ్డి మాట్లాడుతూ... కెనరా బ్యాంకు తరుపున తక్కువ వడ్డీతో హౌసింగ్ లోను, వ్యవసాయం పైన, విద్యార్థులకు, వ్యాపారులకు సులభంగా రుణాలు మంజు రు చేస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై కెనరా బ్యాంకు 8 శాతం వడ్డీ రేట్లు వర్తింపచేస్తోందన్నారు. కెనరా బ్యాంకు పథకాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్లు వెంకటశివారెడ్డి, వెంకటనాగేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రేమ్‌కుమార్, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నవోదయం పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 పోస్టర్లను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పట్టణంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నాటుసారాను నిర్మూలించేందుకు నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అధికారులు నాటుసారా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ దాని నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. ఎక్సైజ్ సీఐ శివసాగర్, ఎస్ఐలు సుశీలమ్మ, మోహన్‌రెడ్డి, గోపాల్, టీడీపీ నాయకులు నారాయణస్వామి, మస్తానప్ప, పత్తిహిమబిందు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించండి

పామిడి: మండలకేంద్రంలో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని నాయీబ్రాహ్మణులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కోరారు. గుంతకల్లు పట్టణంలో శుక్రవారం వారు ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు విన్నవించారు. నాయీ బ్రాహ్మణులు వెంకటరమణ, బాలాజీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.50వేల నగదు డ్రా

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గుత్తి పట్టణంలో ఓ వృద్ధుడిని ఏమార్చి అతడి ఏటీఎం కార్డును తీసుకున్న ఓ గుర్తుతెలియని దుండగుడు రూ.50వేల నగదు డ్రా చేశాడు. గొల్లలదొడ్డికి చెందిన వృద్ధుడు పూజారి రామాంజనేయులు డబ్బు డ్రా చేసుకోడానికి శక్రవారం గుత్తిలోని ఎస్బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాడు. అక్కడ దుండగుడు డబ్బు డ్రా చేసివ్వాలా అంటూ వృద్ధుడి ఏటీఎం కార్డు తీసుకుని మార్చేశాడు. తర్వాత సర్వర్ పని చేయడం లేదని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం మరో ఏటీఎం నుంచి ఆ వృద్ధుడి ఏటీఎం ద్వారా రూ.50వేలు డ్రా చేసుకున్నాడు. ఇంటికెళ్లాక డబ్బు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో వృద్ధుడు ఖంగు తిన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి: బీఎస్పీ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి గ్రామంలో కొద్దికాలం క్రితం భూవివాదంలో హత్యకు గురైన కృష్ణమూర్తిశెట్టి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ రాయదుర్గం ఇన్‌చార్జి సింధనూరు నాగరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సింధనూరు నాగరాజు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు తప్పిదం వల్లే భూసమస్య నేటికీ పరిష్కారం కాలేదని ఆరోపించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. అనంతరం భూసమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. 75 సర్వే నంబర్ భూ సమస్య కోర్టులో ఉందని, కనుక తాము జోక్యం చేసుకోలేమని తెలిపారు.

ఆధారిత విద్య విస్తరణే లక్ష్యం

బెళుగుప్ప, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధారిత విద్య విస్తరణే ట్రాన్స్‌డెంటల్ మెడిటేషన్(టీఎం) లక్ష్యమని జాతీయ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్‌లో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలను ఆయనతోపాటు అంతర్జాతీయ శిక్షకుడు న్యూజిలాండ్‌కు చెందిన మైకేల్, పెర్లి, మెడికోన్ పరిశీలించారు. అనంత రం విద్యార్థులకు ఆధారిత విద్యపై అవగాహన కల్పించారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ విద్య విద్యార్థులను ఒత్తిడికి గురికాకుండా మానసిక స్థిరత్వం కలిగిం చి మేధోసంపత్తిని పెంపొందిస్తుందన్నారు. ఈ విద్యను గుంటూరు, విశాఖపట్నం, విజయవాడ, అనంతపురం జిల్లాల్లో విస్తరింపజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కరెస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ టీడీపీ

● తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి

పామిడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు వైసీపీ కేరాఫ్ అయితే అభివృద్ధికి టీడీపీ కేరాఫ్ అని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. దీని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆపార్టీ పత్రికలో అవాస్తవాలను ప్రచురితం చేయిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలపై బహిరంగ సభకు సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, వైస్ ఎంపీపీ కాయల మహేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఫ్స్, గార్డు రూమ్‌ల ప్రారంభం

గుంతకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఆర్పీ జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఆర్ఫ్స్ , గార్డు రూమ్‌లను జీఆర్పీ ఐజీపీ కేవీ మోహన్ రావు శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా, జీఆర్పీ తిరుపతి డీఎస్పీ అర్షిత, నెల్లూరు డీఎస్పీ మురళీధర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెద్దకొండకు నిప్పు

బెళుగుప్ప, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండా రమణేపల్లి, ఎలగలవంక గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోని కరెమ్మ గుడి వద్ద పెద్ద కొండకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో అక్కడి చెట్లన్నీ దగ్ధమయ్యాయి. అటవీ అధికారులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది.

వారానికి ఐదు రోజుల పనివిధానం తేవాలి

● బ్యాంకు ఉద్యోగ సంఘాల డిమాండ్

గుంతకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు పరచాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) నాయకులు డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల డిమాండ్ల సాధన పోరాటంలో భాగంగా శుక్రవారం సాయంత్రం వారు విధి నిర్వహణ అనంతరం పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులోని కెనెరా బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. బ్యాంకుల్లో పని ఒత్తిడి అధికంగా ఉందని, వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని, బ్యాంకుల్లో ఔట్ సోర్సింగ్ విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. యూఎఫ్‌బీయూ నాయకులు మధుసూదన్, నరేంద్ర, ఎడిసన్, సునంద, సుప్రియ, శ్రీనివాసులు, సునీల్, భరత్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న యూఎఫ్‌బీయూ నాయకులు

మేత.. చింత..!

● పశుగ్రాసానికి ఇక్కట్లు ● ట్రాక్టర్ వరిగడ్డి రూ.8 వేలు


విక్రయానికి ట్రాక్టర్లలో సిద్ధంగా ఉన్న గడ్డి

ఉరవకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కొరత నానాటికీ పెరుగుతోంది. పశుపోషకులు గ్రాసం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్ వరిగడ్డి రూ.8వేలు ధర పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వర్షాభావంతో వేరుశనగ పంట దెబ్బతింటోంది. దీనికితోడు నష్టాలు వస్తుండటంతో ఆ పంటకు రైతులు దూరమౌతున్నారు. వేరుశనగ పొట్టు కరువై.. పశువులకు వరిగడ్డే దిక్కవుతోంది. దీనికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో ఉరవకొండ నియోజకవర్గంలో 72,500, రాయదుర్గంలో 91,477, కళ్యాణదుర్గం పరిధిలో 1,39,120 పశువులు ఉన్నాయి. గుంతకల్లు మండలంలో 20,123 పశువులు ఉన్నాయి. హెచ్చెల్సీ కింద కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో మాత్రమే వరి సాగుచేస్తారు. విడపనకల్లు మండలంలో ఆయకట్టు ఉన్నా, వరి పంట పెట్టరు. దీంతో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల నుంచి రైతులు.. వరిగడ్డి కొనుగోలు చేయాల్సి వస్తోంది. వ్యాపారులు, ఆయా మండలాల్లో వరిగడ్డిని కొనుగోలు చేసి, ఉరవకొండ, గుంతకల్లు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఏడాదికి నాలుగు పశువులకు రూ.80 వేలదాకా గ్రాసం కోసమే ఖర్చు చేయాల్సి వస్తోందని పశుపోషకులు వాపోతున్నారు.

ఏటా కొనాల్సిందే..



నాలుగు పశువులకు ఏడాదికి ఆరు ట్రాక్టర్ల వరిగడ్డి కొనాల్సి వస్తోంది. ట్రాక్టర్ గడ్డి రూ.8వేల ధర పలుకుతుండడంతో భారమవుతోంది. వేరుశనగ సాగు తగ్గడం, పొట్టు దొరక్క, వరిగడ్డి మీద ఆధారపడాల్సి వస్తోంది. దీంతో డిమాండ్ పెరుగుతోంది.

-పురుషోత్తమ్‌రాజు, వజ్రకరూరు

ఆకాశంలో ధర..



గడ్డి ధర ఆకాశాన్నంటుతుండటంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఏడాదికి పశుగ్రాసానికే రూ.80వేలదాకా ఖర్చవుతోంది. సబ్సిడీతో గడ్డి అందిస్తే పశువులకు గ్రాసం కొరత ఉండదు. గతంలో గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేసి, గడ్డిని రాయితీతో అందించేవారు. గత వైసీపీ పాలనలో గడ్డి కేంద్రాల ఊసే లేకుండా పోయింది.

-తిప్పయ్య, ఉరవకొండ

ప్రతిపాదన పంపాం..

కరువు నివారణ పథకం కింద, పశుగ్రాసం దాణా విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే 450 ఎకరాల్లో గడ్డి పెంపకానికి డీఆర్‌డీఏ అధికారులకు ప్రతిపాదనలు పం పాం. టీఎంఆర్ సమీకృత దాణాను స బ్సిడీ కింద అందజేస్తున్నాం.

-వెంకటేశ్వర్లు, డీడీ, పశుసంవర్ధక శాఖ

రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్‌లలో నెలకు ఒక డివిజన్లో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని, ఈ నేపథ్యంలో కళ్యాణదుర్గంలో కూడా నిర్వహించామని తెలిపారు. ఇందులో అధికారులకు పనితీరు, భూపరిపాలనపై పలు సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా భూ రీ సర్వే జరుగుతున్న తరుణంలో అధికారులు పూర్తిగా భూ పరిపాలనపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రీ సర్వే చేయడం వల్ల రైతులకు భూమి ఎక్కువగా ఉందా, తక్కువగా ఉందా అనే విషయాలు తెలుస్తాయన్నారు. భూమి ఎక్కువగా వుంటే ఆ ఎక్కువ అయిన ఎవరిదైనా ఆక్రమించుకున్నారా అనే విషయాలు బయట పడుతాయన్నారు. రైతుల సమస్యలను తహసీల్దార్లు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, అటవీఅధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీవో వసంత్ బాబు, సివిల్ సప్లై డీఎం రమేష్‌రెడ్డి, సర్వే ఏడీ రూప్లానాయక్, పలు శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించండి

బీటీపీ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు అందించాల్సిన పరిహారం వీలైనంత త్వరగా ఇచ్చేలా చూడాలని కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీసుకెళ్లారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం వారు వినోద్‌కుమార్‌ను కలిసి మాట్లాడారు. బీటీపీ కాలువ కోసం ఇంకా సేకరించాల్సిన భూమి, ఆగిన పనులను తిరిగి ప్రారంభించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవి వస్తున్నందున గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కలెక్టర్ స్పందించి తప్పకుండా బీటీపీ పనులకు అవసరమైన భూమి సేకరించేందుకు, రైతులకు అందాల్సిన పరిహారం ఇచ్చేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని చెప్పారు.

విద్యాశాఖాధికారులతో ఎమ్మెల్యే సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖాధికారులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పట్టణంలోని ప్రజావేదిక వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల పురోగతి, వసతి, నాడు-నేడులో అర్ధంతరంగా ఆగిపోయిన పనులకు సంబంధించి విషయాలపై డీఈవో ప్రసాదరావుతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. నాడు- నేడు కింద గత పాలకులు ఇష్టారాజ్యంగా సగం పనులు చేసి బిల్లులు తీసుకున్నారని తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. చాలాచోట్ల ఉపాధ్యాయుల కొరత ఉందని, సమస్య పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందేలా చూస్తామని అన్నారు. పదవ తరగతి విద్యార్థులను మరింత ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు చొరవ చూపాలని దిశానిర్దేశం చేశా రు. కార్యక్రమంలో అన్ని మండలాల వి ద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలోని స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతిపూజ, పుణ్యహావచనం, పంచగవ్యప్రాశన, వాస్తు పూజ, వాస్తుహోమం, షోడశ గణపతి, మంత్ర పుష్పం భేరిపూజ, చిత్రగోపుర సేవ నిర్వహించి ధ్వజారోహణం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి పాల్గొన్నారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు జేసీ దంపతులకు వేద ఆశీర్వచనాలు, ప్రసాదం అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు శాతం తగ్గకూడదు: సీడీపీఓ

ఉరవకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం తగ్గకూడదని, కనీసం పదిహేనుమందికి తగ్గకుండా పిల్లలు ఉండేలా చూడాలని ఐసీడీఎస్ సీడీపీ ఓ ఎల్లమ్మ సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆమె సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకు 21 రోజులు పిల్లల హాజరు శాతం ఖచ్చితంగా ఉండాలన్నారు. నమోదు చేసుకున్న పిల్లలందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ విజిట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు జ్ఞాపికల అందజేత


జ్ఞాపికలు అందజేస్తున్న విప్ కాలవ

కణేకల్లు/బొమ్మనహాళ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రమిస్తున్న టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు జ్ఞాపికలను బహూకరించారు. రాయదుర్గం పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన కణేకల్లు మండలం హనకనహాళ్‌కు చెందిన వాల్మీకి విజయ్‌కు, క్రాసింగ్‌కు చెందిన మారుతికి, బొమ్మనహాళ్‌కు చెందిన పయ్యావుల అనిల్‌కు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్‌కే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కూలిరేట్లు పెంచాలి

తాడిపత్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు కూలిరేట్లను పెంచడంతో పాటు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓబులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతకోట, రమేష్‌రెడ్డికాలనీ, పడమటిగేరి, కాలువగడ్డ, టైలర్స్‌కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పలువురు నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాడిపత్రిలో బీడీ కార్మికుల కూలిరేట్లు దారుణంగా ఉన్నాయన్నారు. బీడీ కంపెనీ యాజమాన్యాలు రూ.300 కూలి కూడా ఇవ్వలేకపోతున్నారని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంతవరకు కేటాయించిన పాపానపోలేదని ఆరోపించారు. వారి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట నాయకులు ఉమాగౌడ్, నూరి తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సలీం అనే వ్యక్తి మద్యం మత్తులో గూడ్స్ రైలు బోగీపైకి ఎక్కిబోయి విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-1లో నిలిచి ఉన్న గూడ్స్ రైలు బోగీపైకి సలీం ఎక్కబోతుండగా.. పైన ఉన్న హైటెన్షన్ వైర్ల వల్ల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని కాపాడి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సలీం తెలంగాణ రాష్ట్రం మహబుబ్‌నగర్ వాసిగా తెలిసిందని చెప్పారు.

బొలెరో వాహనం బోల్తా..

● ఆరుగురు మహిళా కూలీలకు గాయాలు

పామిడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 44వ జాతీయ రహదారి పెన్నావంతెన సమీపాన శుక్రవారం సాయంత్రం బొలేరో వాహనం బోల్తా పడడంతో ఆరుగురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన 11 మంది కూలీలు సపోటా పండ్లు కోసేందుకు ఉదయం పామిడి కొండాపురం గ్రామానికి వచ్చారు. సాయంత్రం పనులు ముగించుకొని బొలేరో వాహనంలో ఇంటికి బయలుదేరారు. అయితే డ్రైవ ర్ అజాగ్రత్తతో వాహనం నడపడంతో పెన్నావంతెన సమీపంలో డివైడర్‌కు ఢీ కొని బోల్తా పడింది. ప్రమాదంలో కూలీలు రామక్క, శంకరమ్మ, సోనియాబాయి, నీలవేణి, శారదబాయి, గీతాబాయి గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తాడిపత్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కేజీబీవీ పాఠశాల, పెద్దపొలమడ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్, ఇంటర్ చదువుతున్న 151మంది విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన ప్యాడ్‌లు, పౌచ్‌లు, పెన్నులు వంటి స్టేషనరీని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వారు శుక్రవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ గౌరవ సలహాదారు శ్రీధర్‌రెడ్డి, వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


యాడికిలోని కేజీబీవీలో అష్టదిగ్గజాల వేషధారణలో విద్యార్థినులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి: ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మికవేత్త కృష్ణయ్య హాజరై మాతృభాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. మాతృభాషను మరువరాదని సూచించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ మస్తానయ్య విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే యాడికి మండలకేంద్రంలోని కేజీబీవీలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా పలువురు విద్యార్థినులు అష్టదిగ్గజాల వేషధారణలలో తెలుగు ప్రాముఖ్యతను వివరించారు. ఎస్ఓ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయ రామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. పామిడి పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషలలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం రామ్ కుమార్ ఎస్ఎంసీ చైర్మన్ పత్రా శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విడపనకల్లు మండలం పొలికి గ్రామంలో గల ఎంపీయూపీ పాఠశాలలో మాతభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జేవీవీ నాయకులు హరిప్రసాద్‌యాదవ్, గంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్వ్యూలు


గుంతకల్లులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కా ర్యాలయంలో శుక్రవారం సబ్సిడీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూ లు మొదటి రోజు సజావుగా సాగాయి. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1నుంచి 12వ వార్డుల వారికి, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు 13నుంచి 20వ వార్డుల దరఖాస్తుదారులకు బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు జరిపారు. 24వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు రెండో విడత కింద 21నుంచి 37వ వార్డుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. ఈ సారి ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టడంతో ఎలాంటి ఇబ్బంది జరగలేదని చెప్పారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 178మంది దరఖాస్తుదారులకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా తెలిపారు. మెప్మా సీఎంఎం శ్రీనివాసరెడ్డి, సీఓలు చంద్రశేఖర్, సురేఖ, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తంగా 261 మంది దరఖాస్తుదారులు ఉన్నారని, వారికి వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు చేశారని ఎంపీడీఓ షకీలా బేగం తెలిపారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 299 మంది దరఖాస్తుదారులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూలు చేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 77 మంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు చేసినట్లు ఎంపీడీఓ నందకిశోర్ తెలిపారు. పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 141 మంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు చేసినట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. పలుబ్యాంకుల మేనేజర్లు ఇంటర్వ్యూలు చేశారని చెప్పారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ఎల్లమ్మ ఉత్సవ విగ్రహం

పామిడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాణి నగర్‌లో రే ణుకా ఎల్లమ్మ గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం నూతనంగా తయారు చేయించిన ఉ త్సవమూర్తిని ట్రాక్టర్‌లో కొలువదీర్చి పట్టణ పురవీధుల్లో మేలతాళాల మధ్య గ్రామోత్సవం చేపట్టారు. దారి పొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు సమర్పించారు.

హుండీ కానుకల లెక్కింపు

కూడేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో హుండీల కానుకల్ని శుక్రవారం లెక్కించారు. ఆలయ ఆవరణలో లెక్కింపు చేపట్టామని, రూ. 4,79,664 ఆదాయం వచ్చిందని దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి వన్నూరప్ప తెలిపారు. 9 నెలలుగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ముడుపులు, కానుకలను లెక్కించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆలయ ఈఓ రమేష్ బాబు, అర్చకుడు మహేష్, బొమ్మయ్య, జయప్రకాష్ గౌడ్, బాట వెంకటేష్, నారాయణస్వామి, ఎద్దుల సుధాకర్, ఈశ్వరయ్య, బసన్నగౌడ్, సంగప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కణ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిరమిడ్ ధ్యానకేంద్రం సమీపంలో గల అన్నపూర్ణేశ్వరి ఆలయ పంచమ వార్షికోత్సవ పోస్టర్లను శుక్రవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మార్చి8 నుంచి 10వతేదీ వరకు వార్షికోత్సవ వేడుకలను జరపనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలో అనేక పూజలు, హోమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామలింగ, ప్రధాన అర్చకుడు మోహన్ శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

పామిడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వడుగూరు బాషా శుక్రవారం మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మృతదేహాన్ని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షులు బొమ్మా మోహన్‌కృష్ణ సందర్శించి నివాళులర్పించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

కణేకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ కర్ణాటక మద్యాన్ని శుక్రవారం మండలకేంద్రంలో ధ్వంసం చేశారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో కణేకల్లు, బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గంటౌన్, బెళుగుప్ప, వజ్రకరూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాదాపు 238 కేసుల్లో దొరికిన 14,768 టెట్రాప్యాకెట్లను, 90 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగమధు, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

దాసరి సుశీల, W/o. దాసరి ఆంజనేయులు, D.No.3/126-A, కసాపురం గ్రామం, గుంతకల్ మండలం వారికి సంబంధించిన ఆస్తి అనంతపురం రి.డి. గుంతకల్లు సబ్.డి.కి చేరిన గుంతకల్ గ్రామ పొలం ఇండస్ట్రియల్ ఏరియా కు పడమర దిశగల ప్లాట్ 1A, 2A, సర్వే.నెం. 687-D లో, 143.33 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్ ను సంప్రదించగలరు.

హద్దులు: తూర్పు: ఇతరుల భూమి, **పడమర:** 20 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** నా మిగులు భూమి, **దక్షిణం :** ప్లాట్ 3A

సం/- **M.G. భాస్కర్ గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు.

ప్రకటన

అక్కిలి రామ్ ప్రసాద్, S/o. Late అక్కిలి గోపాల్, D.No.1/1851B, వాణినగర్, పామిడి టౌన్, పామిడి మండలం వారికి సంబంధించిన ఆస్తి అనంతపురం రి.డి. పామిడి సబ్.డి.కి చేరిన పామిడి గ్రామ పొలంలో సర్వే.నెం.239/A1, 240/C లో, ప్లాట్ 1,2, 1241.21 గజాల స్థలాన్ని గుంతకల్లు. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు. శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్ ను సంప్రదించగలరు.

హద్దులు: తూర్పు: N.H. 44 రోడ్డు, **పడమర:** 25 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** జవహర్ చిన్న రామాంజనేయులు రావు కుమారుల భూమి, **దక్షిణం :** నాకు విక్రయించిన ప్లాట్2

సం/- **M.G. భాస్కర్ గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు.

ప్రకటన

వీర రాఘవులు, S/o. Late బెల్లపు కొండ చిన్న కొండయ్య, కాకుల ఇల్లిందలపర్రు గ్రామం, ఇరగవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా వారికి సంబంధించిన ఆస్తి భీమవరం సబ్ రిజిస్టర్ పరిధిలో ఇరగవరం మండలం, కాకుల ఇల్లిందలపర్రు గ్రామ పంచాయతీలో సర్వే.నెం. 104/2 లో, 87.6 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్ ను సంప్రదించగలరు.

హద్దులు: తూర్పు: రాజ వీధి లి.36లు, **పడమర:** బెల్లంకొండ నాగేశ్వర రావు తాలూకు ఇల్లు, స్థలం,ఆ38లు, **ఉత్తరం:** రాపూరి మహాలక్ష్మి వద్ద నేను క్రియమునకు పొందిన స్థలం ఆ 49లు, **దక్షిణం:** సిద్దాని మోహన్ రావు గారి ముందు పెట్టుకొనబోయే గోడ లి.49లు.

సం/- **M.G. భాస్కర్ గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పామిడి బ్రాంచ్ వారు పి.హరీష్ S/o పిల్లల మల్లికార్జున, అను పేరున గల అనే ఆస్తి తాకట్టు పై పి.రాధమ్మ W/o పి.హరీష్, డో.నెం.5-23, ఏగువపల్లి గ్రామం, గార్లదిన్నె మండలం, అనంతపురము జిల్లా వారికి ఋణం అప్పదలచు కున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న చో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి.డి. పామిడి సబ్ రి.డి.కి చేరిన కల్లూరు పంచాయతీ ఏరియాలోని కల్లూరు అగ్రహారం గ్రామం పొలంలోని సర్వే నెం. 345-2బి1లో 447.77 చ.గజలు. చెక్కుబంది:-తూర్పు : ఎన్‌హెచ్-44 రోడ్డు. పడమర: పి.రామాంజనేయులు భూమి, ఉత్తరం: పిల్లల హరిమూర్తి స్థలం, దక్షిణం: పిల్లల శ్రీరాములు స్థలం.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907